పేదల కలలు

(నాలుగు అనువాద కథలు)

సైన్స్-హేతువాదం ప్రచురణలు,

ఖమ్మం

పేదల కలలు (అనువాద కలలు సంకలనం)

సంపాదకత్వం : గౌరవ్

ప్రచురణ : సైన్స్ – హేతువాదం

ప్రథమ ముద్రణ : మే, 2017

వెల : 40/–

© కాపీలెఫ్ట్ : సర్వహక్కులు సంఘానివి

ప్రతులకు : డా॥ భానుప్రసాద్,

అంబేద్కర్ హాస్పిటల్, యు.బి. రోడ్, భద్రాచలం.

8519896706

వివరాలకు : gouravmeka@gmail.com, 9032094492

ఐ.వి., 9948834788

లోగొ

హృదయ పూర్వక కృతజ్ఞతలు

మానవీయ సాహిత్యాన్ని వెలువరించే క్రమంలో భాగంగా ఈ ప్రతినిలా మీ ముందుకు తీసుకురావడానికి కొంతకాలం నుండి ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రచురణాభారం మోయలేక పక్కన పెట్టాల్సి వచ్చింది. భద్రాచలం మిత్రులు డా॥ భానుప్రసాద్‌గారి సహకారం వలనే యిది సాధ్యమయింది. ఆయనకి మా అభినందనలు. అలాగే మా ప్రయత్నాల్లో ఎవరి పరిమితుల్లో వారు సహకరించవలసిందిగా మనవి.

కో మాట

కీ॥శే॥ అవంత్స సోమసుందర్‌గారెప్పుడిచ్చారో తెలీదు కానీ నా పుస్తకాల్లో పాతనోట్స్ కాగితాలకు పత్రికల్లో అచ్చయిన కాగితాలు అంటించిన ఒక చిన్న పొత్తం దొరికింది. నాలుగు ఉర్దూకథల తెలుగనువాదం అది. మూడు చిన్న కథలు, ఒక కథానిక. సో.సు. ఐదో నెంబరు వేసి ఖాళీగా ఉంచేసారు. బహుశా మరోటి కలుపుదామని భావం కావొచ్చు. కళాకేళి నికేతన్ స్టాంప్‌తో దాదాపు శిధిలావస్థకు చేరిపోయిన ఆ పొత్తంలోని కథలు ఎందుకనో ఈరోజు మరింత అవసరమనే స్పృహ కలిగింది. మనిషికంటే మతానికే విలువ పెరుగుతున్న ప్రస్తుత సమాజంలో, మతతత్వాన్ని తోసిరాజని మానవత్వానికి పట్టంకట్టే ఏ చిరు ప్రయత్నమయినా ఆహ్వానించదగ్గదేనని నా భావం. అలాగే దేశభక్తి పేరిట దేశాన్ని లూఠీ చేస్తున్న వర్తమాన వ్యవస్థలో ఏది దేశభక్తో ఎవరికది అవసరమోననే స్పృహ కావాలి. అట్టడుగు వర్గాల దీనస్థితికి అద్దంపట్టే ఇవి అప్పట్లో, ఏయే పత్రికల్లో ప్రచురించబడినాయో తెలీదు. ఇంకొద్ది రోజుల్లోనే కాలానికి ఆహుతైపోనున్న ఆ కాగితాల్లోని అక్షరాల్ని వో దరికి చేర్చి ఈ కథల్నిలా మీ ముందుకు తేవడం అవసరమని తోచడంతో ఇదిలా బయటికొచ్చింది. ఉన్మాదం కన్నా వివేచన ఎన్నోరెట్లు ఉత్తమమని యిది చదివిన తర్వాత ఏ కొందరు తీర్మానించుకొని ఆలోచనకి ఆసరాగా నిలబడ్డా ఈ కృషి ఫలించినట్టే.

– గౌరవ్, పిఠాపురం
10 ఏప్రిల్, 2017

ఇందులో....

1.	నేనెందుకు నవ్వుతున్నానా?	5
2.	స్మశానం	16
3.	ఉరి మూల్యం	21
4.	పేదల కలలు	28

కథ

IF SHARKS WERE PEOPLE...

"If sharks were people," his landlady's little daughter asked Mr. K, "would they be nicer to the little fish?" "Of course," he said, "if sharks were people, they would have strong boxes built in the sea for little fish. There they would put in all sorts of food plants and little animals, too. They would see to it that the boxes always had fresh water, and they would take absolutely every sort of sanitary measure. When, for example, a little fish would injure his fin, it would be immediately bandaged so that he would not die on the sharks before his time had come. In order that the little fish would never be sad, there would be big water parties from time to time; for happy fish taste better than sad ones.

Of course, there would be schools in the big boxes as well. There the little fish would learn how to swim into the mouths of the sharks. They would need, for example, geography so that they could find the sharks, lazing around somewhere. The main subject would naturally be the moral education of the little fish. They would be taught that the grandest, most beautiful thing is for a little fish to offer himself happily, and that they must all believe in the sharks, above all when they say that they will provide for a beautiful future. One would let the little fish know that this future is only assured when they learn obedience....

If sharks were people, there would of course be arts as well. There would he beautiful pictures of sharks' teeth, all in magnificent colours, of their mouths and throats as pure playgrounds where one can tumble and play. The theatres on the bottom of the sea would offer plays showing heroic little fish swimming enthusiastically down the throats of the sharks.... There would certainly be religion. It would teach that true life begins in the sharks' bellies... In short, there could only be culture in the sea if sharks were people."

From '*Kalendergeschichten*' by Bertolt Brecht.

"నేనెందుకు నవ్వుతున్నానా?"

రచన : **అబ్బాస్** అనువాదం : **సూరన్న వి.**

(**మ**నసు చెదిరిన ఒక రెఫ్యూజీ ముందూ వెనుకా, హిందూ, ముస్లిం కత్తిపోట్లు తిని చివరి దశలో – డాక్టరు, ఒక మౌలానా ఒక సనాతన హిందూ యింకా యితరుల ముందు తన కథంతా చెబుతాడు)

"నేనెందుకు నవ్వుతున్నానో మీకు తెలుసుకోవాలని వుంది? చావసిద్ధంగా వున్న మనిషి ఎందుకు నవ్వుతున్నాడా అని మీకు తెలుసుకోవాలని వుంది. కాదు?

డాక్టర్ సాబ్! మీ కేమీ ఆందోళన వద్దు. మీ డిస్పెన్సరీకు వెళ్ళి మీ క్వినైన్, ఆస్పిరిన్ మాత్రలు అమ్ముకోండి. మీరు గాని యింకెవరుగాని యీ చావునుండి తప్పించలేరు. నాకు ఒక్క కత్తిపోటే గాదు! రెండు : తీవ్రంగా – ఒకటి వెన్నులోనుండి లివర్ వరకూ, రెండోది కడుపులో – పేగులు, రక్తం, కన్పించటంలా?...

నే నెందుకు నవ్వుతున్నానో తెలుసుకోవాలని మీరంతా ఆగారు? 'చావ సిద్ధంగా వున్న మనిషి యీ దశలో ఎందుకు నవ్వుతున్నాడా' అని మీకు ఆశ్చర్యంగా వుంది? చెపుతాను. కారణ మేమంటే – నే నెవరినో నాకిప్పుడే జ్ఞాపకం వచ్చింది....

ఏమన్నావు భాయీ? అందులో నవ్వేందుకేముందా? ఆగు, అంతా వినేవరకు. అప్పుడే... నే చావబోతున్నా ఎందుకు నవ్వుతున్నానో నీకే తెలుస్తుంది..... రెండు నెల్ల నుండి నేనెవరినో తెలిసికోవటానికి ప్రయత్నిస్తున్నా, ముస్లింనా, హిందూనా, సిఖ్ఖునా?... బ్రాహ్మణుడనా' అంటరానివాడినా? 'పేదవాడనా' భాగ్యవంతుణ్ణా? ... తూర్పు పంజాబు నుండా, పశ్చిమ పంజాబు నుండా? ... నాది – లాహోరా, అమృతసరా? లేక, రావల్పిండా, జలంధరా? అని, నేనే కాదు యింకా చాలామంది ప్రయత్నించారు నన్ను గుర్తుపట్టడానికి. నాకులం, నా మతం, నాపేరు? కాని సాధ్యం కాలా యెంత ప్రయత్నించినా నాకే గుర్తుకు రావటం లేదు, కాని యిప్పుడే జ్ఞాపకం వచ్చింది. .... యిపుడే, నే చనిపోయేటపుడు:...

డాక్టర్! మీ ఆందోళన నేమీ సాయం చేయదు. నమ్మండి ప్రపంచంలో యింకే డాక్టరూ నన్నిపుడు బ్రతికించలేడు.

ఈ రెండు వైపులా వున్న కత్తి పోట్లు – ముందు మీరు ఏ గాయానికి చికిత్స చేయాలా అనే సమస్యలో వుంచాయి. నా జీర్ణ ప్రేగులను సరిచేయటానికి నన్ను వెల్లకిలా పడుకోబెడ్తే వెనుకగాయంలో నుండి రక్తమంతా పోతుంది. మీరు ఆరంభించక ముందే నే చనిపోతాను. పోనీ, నన్ను అటు త్రిప్పి వెనుకవున్న గాయాన్ని చికిత్సకారంభించితే – ప్రేగులు, లివరు అన్నీ బైటికి వస్తాయ్. అంచేత తొందరొద్దు. నా కథ వినండి...

అది రెండు నెలల క్రితం – కొన్ని రోజూలయ్యాక నాకు స్పృహ వచ్చింది. అపుడు నేను ఢిల్లీ గవర్నమెంటు హాస్పిటల్‌లో వున్నట్లు మాత్రం తెలుసుకొన్నాను. 'నీ పేరేమ'ని డాక్టరడిగితే, ఎంత ప్రయత్నించినా గుర్తుకు రాకపోవటం చేత, "గుర్తులేద"నే చెప్పాను. "హిందువా, ముస్లింవా" అని కూడా అడిగితే దానికీ యింకే సమాధానం దొరకలేదు. నాకు – నా గడిచిన జీవితాన్ని గూర్చి... ఆఖరుకు నా మతంగాని, కులంగాని, యిల్లుగాని, కుటుంబంగాని ఏవీ జ్ఞాపకం లేవు! చివరికి – నాకు పెళ్లయిందో, లేదో కూడ మరచిపోయా. నేను యువకుణ్ణని మాత్రం కొంచెం తెలుసుకున్నాక, అద్దంలో చూసుకుంటే కొత్తగాను, ముడుతలతో, అపరిచిత ముఖంలా కన్పించింది. నేనలాంటి మొహం యిదివరకెపుడూ చూసినట్లు గుర్తులేదు.

న్యూఢిల్లీలోని డాక్టర్లంతా నా చెదరిన మనస్సును బాగుచేద్దామని ప్రయత్నించి విఫలురయ్యారు. కనీసం నే నెవరినో గుర్తించుకోటానికి కూడ సాయం చేయలేకపోయారు. నాకు పేరు లేకపోతే చచ్చిన వాళ్ళతో సమానమేనని, ఎంతో ప్రయత్నించా, జ్ఞాపకం తెచ్చుకోటానికి.

ఎంక్వయిరీ చేసిన తర్వాత మాత్రం – నేను పంజాబునుండి, శరణార్థులలో గాయపడి తీసుకురాబడిన వాళ్ళలో చావగా బ్రతికిన వాళ్ళలో నేనొకణ్ణని మాత్రం తెలుసుకున్నాం. వాళ్ళు ఏమతం వాళ్ళని నేను హాస్పటల్‌లో అడిగితే – అన్ని మతాలవారూ వున్నారనే తెల్సింది. ఏం పని జరిగిందంటే – అమృతసర్‌కూ లాహోరుకూ మధ్య శరణార్థులున్న రైలుబండ్లు రెండూ ఒకదాని తర్వాత ఒకటి పట్టాలు తప్పి బోల్తాలు కొట్టాయి. ఒకదాంట్లో పడమటి పంజాబు నుండి అమృతసర్‌కు వచ్చే హిందూ శరణార్థులూ, రెండో దాంట్లో తూర్పు పంజాబునుండి లాహోరు పోయే ముస్లిం శరణార్థులూను. రాత్రి 11 గంటలకు రైలు వెళ్తూంటే, పట్టాలలో ఓ బాంబు ప్రేలింది. చాలామంది చచ్చారు. కొందరు తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు దగ్గర పొదల్లో దాక్కున్న గూండాల తుపాకి గుండ్లకు, కత్తిపోట్లకు

ఆహుతయ్యారు. దెబ్బలుతిన్న కొందరు మాత్రం ఆ చీకట్లోనే గుడ్డిగా పరిగెత్తారు. చెల్లాచెదురుగా;

ఇంకొక గంటకు ఓ మైలు దూరంలో ఎదురొచ్చే బండికీ యిదే గతి పట్టింది... అక్కడా యిట్లాగే!... దగ్గరలో వున్న అడవిలోకి దున్నిన పొలాల్లోకి పరుగులెత్తారు.

మర్నాడుదయం – ఇండియన్ యూనియన్ సేనలు పాకిస్థాన్ సేనలు సరిహద్దు కాపలా కాయడానికి వెళ్ళినపుడు – ఆ రైళ్ళనూ, శవాలనూ, గాయపడ్డ వాళ్లను చూసినయ్. ఆ బౌండరీలో పడినవాళ్ళు హిందూలో, ముస్లింలో గుర్తించలేకపోయారు. ఆ దౌర్భాగ్యుల్లో నే నొకణ్ణని, నా బట్టలన్నీ రక్తముతో వున్నాయని, నా కాళ్ళు పాకిస్థాన్‌లోనూ తక్కిన శరీరం ఇండియన్ యూనియన్‌లోనూ వున్నాయని, స్పృహతప్పి పడివున్నానని అంబులెన్సులోకి నన్ను దెచ్చినతను చెప్పాడు.

ఆ క్రొత్త బౌండరీలైనంతా రక్తంతో గీయబడినట్లుందట! హిందూ, ముస్లిం సిక్కుల రక్తం మిళితమై పవిత్ర భూమిలో యింకింది! అవిభాజ్యంగా... అవిభేదంగా!...

మౌలానా! ఎందుకట్లా నావైపు చూస్తావ్! నీవేమనుకుంటున్నావో నాకు తెలుసు. నేను ముస్లింననే చెప్పుకుంటాననే ఆశతో చూస్తున్నావ్. మీ 'అంజుమన్ ఖుద్దమ్–ఉల్–ముస్లిమీన్'ల తరఫున కర్మకాండలు జరపటానికి సిద్ధమవుతున్నావ్.

ఓ మహాశయాజీ! నువ్వో! నున్నని గుండుమీద పవిత్రంగా పిలక ధరించావ్! నీ ఉద్దేశం కూడా నాకు తెలుసు. నేను హిందువునని చెప్పుకుంటానని మీ 'ధర్మసేవక సంఘం' తరఫున అంత్యక్రియలు చేయాలని ఎదురు చూస్తున్నావ్!

బొంబాయిలో పార్శీలు, చచ్చిన వాళ్ళను రాబందులకు వదులుతారనీ రాబందులెపుడూ ఎదురు చూస్తుంటాయనీ విన్నాను. కాని మనుషులు కూడ రాబందుల్లాగ... యిట్లా.... అని నాకు తెలీదు.

నా కథ చెప్పటానికి ఎక్కువసేపు మాట్లాడాను.

అప్పటి నా గాయాలు రెండు వారాల్లోనే నయమయాయ్ కాని నా మెదడు దెబ్బతింటం మూలాన జ్ఞాపకశక్తికి లోటు వచ్చిందని డాక్టర్లు చెప్పారు. అందుచేత యిక నేను పేరు లేని మనిషి గానే పేరు పొందాను. పాకిస్తాన్ పత్రికల్లోనూ ఇండియా పత్రికల్లోనూ నా ఫోటోలు ప్రకటించారు. నా స్నేహితులుగాని, బంధువులుగాని, ఎరిగున్న వాళ్ళుగాని నన్ను గుర్తిస్తారేమోనని.

బహుశః వాళ్ళుకూడ చంపబడే వుంటారు.

ఇక నే నొక్కడనే యీ ప్రపంచంలో.

తర్వాత ఆ హాస్పిటల్లోకి యింకా కొందరు క్రొత్తగా, గాయపడ్డ శరణార్థులు రావటంవల్ల, యిక నాకక్కడ తావులేదని డాక్టరు చెప్పటం మూలాన బైటకొచ్చేశాను. యింకెక్క డన్నా పిచ్చాసుపత్రిలో చేరదామని.

నగరమంతటా తిరుగుతూ 'జేమ్ మసీద్' వద్దకు వచ్చాను. అక్కడ కెదురుగా ఓ మైదాన్‌లో వున్న శరణార్థుల కాంపుకు వెళ్ళి శరణు వేడాను. అక్కడ – "హిందువునా? ముస్లింనా? అని అడిగితే – నాకు గుర్తుకు రావటం లేదని చెప్పా. అది నిజమేగా! నాకు అబద్ధం చెప్పాలని లేదు. "ఇది ముస్లిములకు మాత్రమే" నని ఖచ్చితంగా చెప్పటం. మళ్ళీ నేను వీదులంట తిరగటం.

న్యూఢిల్లీ చేరుకున్నా. ఇక్కడింకా చాలా పెద్ద శిబిరాలున్నాయి. నేను వాలంటీర్లను రక్షణివ్వమని భిక్ష వేడుకున్నా. "హిందూవా? ముస్లింవా?" అనే అడిగారు అక్కడ కూడ. "జ్ఞాపకంలేద"ని చెప్పక తప్పింది కాదు.

'పేరు?'

"అది కూడ జ్ఞాపకం లేదు. నాకింకే విషయం కూడ గుర్తులేదు."

"అయితే యింక్కెడికైనా పో! ఇది హిందువులకు మాత్రమే" అన్నారు.

ఇక చేసేది లేక అట్లాగే ప్రతి క్యాంపుకు తిరిగాను. హిందూలకూ వున్నాయి. ముస్లింలకూ వున్నాయి. గాని యీ 'రెఫ్యూజీక్యాంప్సు' మానవ మాత్రులకు మాత్రం ఎక్కడాలేవు!

ఆ రాత్రికి చాలా అలసిపోయా. పాదాలు పుళ్ళుపడ్డాయి. స్పృహ తప్పి పడిపోయాను రోడ్డుమీద, ఒక సిక్కు సర్దార్ బంగళాకెదురుగా, ఆయన సెక్రటేరియట్‌లో చిన్న ఉద్యోగి. నన్ను తీసుకెళ్ళి వుపచారం చేసి పాలు త్రాగించాడు. నాకు స్పృహ వచ్చాక ఆయన నన్ను "హిందూవా, ముస్లింవా, సిక్కువా?" అని మాత్రం అడగలేదు.

'కాస్త తేలికగా వుందా, భాయీ! అని మాత్రం అడిగాడు.

అక్కడే కొన్ని రోజులున్నాను. ఆ సిక్కు సర్దార్ భార్య, పిల్లలు వాళ్ళంతా నన్ను చాలాదయతో చూశారు. నేను నా కథంతా చెప్పి, నా మనస్థితి కూడా చెప్పి,

నే నెవరినో చెప్పలేనని కూడా చెప్పాను. అయినా వారెంతోదయతో చూసారు. కొన్ని రోజులయ్యాక రావల్పిండి జిల్లా నుండి, వాళ్ళ బంధువులు శరణార్థులై వచ్చారు. ముస్లిం గూండాలచే తీవ్రంగా గాయపడ్డారు. బలవంతాన మతంలోకి మార్చబడ్డారు. తోటివాళ్లు, వాళ్ళ బంధువులు చిత్రవధ చేయబడటం వాళ్ళు కళ్లారా చూశారు. అందుచేతనే వాళ్ళ గుండెలు అసహ్యంతోనూ, ద్వేషంతోనూ మండుతున్నాయి. వాళ్ళూ, వాళ్ళూ చెప్పిన కథలు వింటూంటే, ముస్లింలంటే నాక్కూడా అసహ్యం పుట్టింది.

ఆ సిక్కు సర్దార్, నేనెట్లా జ్ఞాపకశక్తి హీనుణ్ణియానో, నా వింత కథంతా వాళ్ళకు చెప్పాడు. వాళ్ళలోని పెద్దవాళ్ళు నా మనస్సును యథాస్థానంలోకి తేవడానిక్కూడా ప్రయత్నించారు. కాని యువకులు మాత్రం నన్ననుమానించసాగారు. ఒకనాటి రాత్రి వాళ్ళలో ఒకడు నేను అబద్ధం చెపుతున్నానేమోనని, పోనీ, ఒకవేళ నిజంగానే జ్ఞాపకశక్తి పోయినా నేను ముస్లింగా మారిపోయానేమోనని చెప్పటం విన్నాను. వాళ్ళ చూపుల్లో ప్రమాదాన్ని చూశాను. ఆ ఆలోచనే నాకు మళ్ళీమళ్ళీ తట్టింది – "ఒకవేళ నేను ముస్లింనే అయితే? నే గాయపడక పూర్వం, అలాంటి ఘోరాలు ఎన్నో చేసివుండకూడదు, ఎవరికి తెలుసు?" అని యిట్లాగు.

ఆ రాత్రే ఆ యిల్లు విడిచి పారిపోయాను. మళ్ళీ రోడ్లు; ఆకలీ; యివేగతి!

"ఇది ముస్లిం శరణార్థుల శిబిరం"

'నీవెవరవు?' నీ పేరేమిటి? నీ మతం?

ఎక్కడ్నుంచి వచ్చావ్? "ఇవే ప్రశ్నలు, ప్రశ్న పరంపరలు? జ్ఞాపకశక్తిహీనుణ్ణి కాబట్టి వీటిల్లో దేనికీ సమాధానం యివ్వలేకపోయాను.

ఇకెక్కడా రక్షణలేదు. నడవటానికి కూడా శక్తిలేదు. ఆ 'జేమ్‌మస్జీద్' మెట్లమీద పడ్డాను, చావసిద్ధమై, అక్కడ నేనెంతసేపు తెలివిదప్పిపడి వున్నానో గాని నే కళ్ళు తెరిచి చూసేసరికి ఒక 8 సం॥ బాలుడు నన్ను లేపుతూ, వాళ్ళ తల్లి యిచ్చిన చపాతీలు తీసుకోమంటున్నాడు. నే కూర్చోలేకపోయినా, అవిమాత్రం పూర్తిజేశాను. పళ్ళెం కూడ నాకేసి, బాలుణ్ణి దీవించి కౌగలించుకున్నా. నాకు జ్వరంగా వుందని తన తండ్రి వద్దకు రమ్మని చేయూతనిచ్చాడు. హకీం సాహెబ్ అతని తండ్రి గొప్ప వైద్యుడు. దైవభక్తి పరాయణుడైన ముస్లిం. రోజుకైదుమార్లు నమాజు చేయటం, హిందూలైనా, ముస్లింలైనా పేదరోగులకు వుచితంగా మందులివ్వటం, ఆయన

నాకు రోజుకు ముమ్మారు పాలు, యునాని మందులు యిచ్చేవాడు. నా జ్వరమైతే పోయింది కాని, అంత గొప్ప వైద్యునిక్కూడా నా జ్ఞాపకశక్తిని కూర్చే మందు లేకపోయింది. "నేను హిందువునవుతానేమో, అందచేత మీ యిల్లు విడిచి వెళ్ళవలసి వస్తుందేమో" అని అంటే దయాళుడైన ఆ వృద్ధుడు – "ఏం, హిందువైతే? అని బలవంతానవుంచాడు అక్కడే.

కాని ఒక సంఘటన జరగడం వల్ల నే నక్కడుండటం సంభవించలేదు. ఒక రోజు మామూలుగా హకీంసాహెబు కొడుకు ఆకలితో మాడే శరణార్థులకు భోజనం పట్టుకెళ్ళి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. నేనూ ఆయనా ఎంత వెదకినా ఏమీ జాడలు దొరకలేదు. ఆ బాలుణ్ణి మసీద్‌వద్ద హిందూలు చంపారని ఆ రాత్రికి తెలిసింది. పాపం అతని తల్లి యిది విని తెలివిదప్పి పడిపోయింది. ఆమె హకీమ్ సాహెబు కంటె కూడ ఎక్కువ దయచూపేది. రాత్రింబవళ్ళు నా కతని రూపే కనిపించేది. అతని పరిచిత కంఠం విన్పించేది. – "జ్ఞాపకం వుంచుకో! నీవు చావసిద్ధంగా వున్నపుడు నీకు భోజనంపెట్టి బ్రతికించినది నేనే. అయినా నువ్వే నన్ను చంపావ్!" అని విన్పించేది. నేను చంపలేదని నాకు తెలిసినా – ఒకవేళ, నే హిందువునే అయితే గాయపడకపూర్వం యిలాంటి అమాయక ముస్లిం బాలురను ఎంత మందిని చంపానో అనే తలంపు నాకనేకమార్లు తట్టింది. చాల బాధ పెట్టింది. అంచేత వుదయాన్నే ఆ యిల్లు విడచి పారిపోయాను.

ఆ రోజుల్లో ఢిల్లీలో మహా భయంకరంగా వుంది; పట్టపగలే ఖూనీలు, విశాల వీధుల్లో బుల్లెట్స్ అన్ని వైపుల్నుండీ దూసుకొస్తున్నాయ్. నాకేం తెలీకుండానే ఎట్లా తప్పించుకొన్నానో రైలు స్టేషన్ చేరుకున్నాను.

బొంబాయిలో యిక్కడ కన్నా కొంచెం తక్కువేనని తెలిసింది. అప్పుడే కదలబోతున్న ఫ్రాంటియర్ మెయిల్ చూడగానే ఎక్కి కూర్చున్నా. పెట్టంతా కిక్కిరిసి వుంది. నా ప్రక్కనే ఓ పంజాబు యువకుడు విచారంగా కూర్చుని వున్నాడు. రైలు బయలుదేరింది.

'భాయీ! ఎవరు నువ్వు' అని అడిగితే "నాకు తెలీదు. హిందువును కావచ్చు. ముస్లింను కావచ్చు" అన్నాను. అప్పుడతను – "అదికాదు భయ్యా! ఈ మార్గం ముస్లిం ప్రయాణికులకు చాలా ప్రమాదం. నీకు గడ్డం వుంటం మూలాన అడిగాను" అని నెమ్మదిగా చెప్పాడు. అతనికి నా కథంతా చెప్పాను. మాసిన గడ్డం వుండటం వల్ల నన్ననుమానంతో చూశాడు. సరిగా నన్ను ఎట్లా నమ్ముతాడు? తర్వాత అతని

గూర్చి అడిగితే – అతని షాపు, యిల్లు లాహోరులో లూటీ చేశారని, బంధువులు చంపబడ్డారనీ. యింకొందరు తప్పిపోయారనీ, యిపుడు బొంబాయి వెళ్తున్నానని తన అదృష్టం ఎట్లావుందో అంటూ చెప్పాడు.....

రైలును బరత్‌పూర్ వద్ద ఆపారు. ముస్లింలాగున్న వాళ్ళను బైటి కీడ్చి కాల్చేస్తున్నారు. వ్యవధిలేకుండా, ఇది గుర్తొచ్చినపుడల్లా నాకు నవ్వొస్తుంది! ఎందుకో తెలుసా? ఆ గూండాలు ముస్లింలను కాల్చుతూన్నంతసేపూ, కత్తులతో పొడుస్తూన్నంతసేపూ – 'మహాత్మా గాంధీకి జై' అని అరిచేవారు. చచ్చే క్షణంలోనా నవ్వటానికి యీ విషయం చాలు!!....

ఆ గూండాలు మా పెట్టెవద్దకు వచ్చారు. నేను ముస్లింనని నాకు తెలీదు. కాని నాకు గడ్డం వున్నదని తెలుసు. నా చావుకు ఆ గడ్డం చాలు. వాళ్ళు నా వద్దకు వచ్చేసరికి నాతో వున్న తను నాకు దుప్పటి కప్పి – "మా అన్నయ్యా, లాహోరులో గాయపడ్డాడు. మాట్లాడే స్థితిలో లేడు. అతన్నేమీ చేయొద్ద"ని తత్తరపడకుండా చెప్పాడు. వాళ్ళు తృప్తిపడి వెళ్ళిపోయారు, ఇంకా కొన్ని కాల్పులు, ఆర్తనాదాలు విన్పించాయ్ బలి అయిన వాళ్ళ మూలుగులతో రైలు బయలుదేరింది. ఎట్లయితే బొంబాయి చేరుకున్నా, ఇక్కడ కూడా ఆ ప్రశ్నే వెంబడించింది! – హిందువునా, ముస్లింనా? అసలు ఎవరు హిందువు? ఎవరు ముస్లిం? నన్ను రైల్లో ముస్లింలాగున్నా రక్షించినతను హిందువేనా? హకీం సాహెబ్ యొక్క అమాయిక బాలుణ్ణి చంపిందీ హిందువేనా?... ముస్లిం లంటే ఎవరు? హకీమ్, అతని కుటుంబమా? లేక రావల్పిండిలో సిక్కులను, స్త్రీలను అవమానపరచి, చిత్రవధ చేసిన దుర్మార్గులా? ... సిక్కులందరు ఎవరు? – దయాళుడైన సిక్కు సర్దారు అతని కుటుంబమా? లేక ఢిల్లీ కల్లోలాలకు కారకులైనవాళ్ళా?... ఇందులో .... ఎవరు హిందువు? ఎవరు ముస్లిం ఎవరు సిక్కు?... నీవెవరవ్? హిందూనా? ముస్లింనా? ఇవే ప్రశ్నలు నా చెదరిన మెదడు మీద బాగా పడిన ముద్రలు! ఈ ప్రశ్నలే రేయింబవళ్ళు నన్ను తరిమాయి: నిద్రలో కూడ భూతాల్లాగు, సైతానుల్లాను, ఎర్రని కాల్చిన బల్లాలతో చుట్టుముట్టాయి, యీ ప్రశ్నలకు సమాధానమిమ్మని.

నేను హిందూను కాను, ముస్లింనూ కాను. సిక్కును కాదు. నేనెవరినీ కాదు. నేనొకమనిషిని మాత్రమే. నన్నొదలండని కేకవేసేవాణ్ణి...

బొంబాయిలో కూడ యీ శరణార్థుల శిబిరాలున్నాయి. సిఖ్ఖులైతే సరాసరి – 'ఖాల్సా కాలేజి'కి వెళ్ళు! హిందూవైతే – రామకృష్ణాశ్రమాన్కి పో! ముస్లింవైతే –

అంజుమాన్ యిస్లాం స్కూలుకు ఫో! ... మరి నేనో? నే నెక్కడికి వెళ్ళాలి? నే నెక్కడికి వెళ్ళాలి. నే నెవర్నో తెలియనివాడనయ్యే! నేను వాటిల్లో దేనికీ చెందనుగా?

ఆఖరుకు నాకు ధర్మం కూడ వేయరు ధర్మాలు చేసేవాళ్ళు కూడ – నేను సరియైన తెగకు చెందినవాడనో లేదో అని తెలుసుకో కోరుతాను. మరి నే నే తెగకూ చెందనుగా? యిక ఆకలితో మాడి చావవల్సిందేనా? కాదు, కాదు! నేనెవరినో ఎట్లయినా తెలుసుకోవాలి! తెలియకపోతే తెరువేలేదు!

'డాక్టరు, సామని' వద్దకు వెళ్లమని ఆయనే మెదడు బాగుచేస్తాడని ఒకరు నాకు సలహాయిచ్చారు. 'డాక్టరు సామని' గూర్చి మీరు వినే వుంటారు. ఆయన గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్త. ఆయన ఆపరేషన్లూ చేయడు. మందులూ వాడడు. రోగులతో మాట్లాడి మాట్లాడించుతాడు. అంతే! అందుచేత ఆయన వద్దకే పోయాను.

గదులు చక్కగా, కొత్తరకం దీపాలతో వున్నాయి. అట్లాగే ఆయనా, నర్సు కూడా ప్రతిదీ, స్వచ్ఛంగా, తెల్లగా మృధువుగా సానునయంగా వుంటాయి. అన్నిటికన్నా మృదువైంది – డాక్టరుగా గారి కంఠస్వరం, వెళ్ళగానే ఆయన నన్ను మనస్సు నిర్మలంగా ప్రశాంతంగా, వుంచుకొని, ఏమీ శ్రమివ్వకుండా, ఎటువంటిదైనా సరే మనస్సుకు వచ్చినదల్లా మాట్లాడమని ఎంతో ఆప్యాయంగా చెప్పి కాగితం, పెన్సిలు తీసుకుని సిద్ధమయ్యాడు. నేను కళ్ళు మూసుకున్నాను, గడచినదేదో స్ఫురణకు వచ్చినట్లుంది. మనస్సులో ఎట్లా కన్నిస్తే అట్లాగే చెప్పటం ఆరంభించా... నీలాకాశం... నీలాకాశం.... పచ్చని పొలాలు.. ప్రవహిస్తూన్న నది... పడవలు.. పిల్లలు.. కాలవల్లో స్నానం చేస్తున్నారు. ... ఆడుకుంటున్నారు.... నీళ్ళు జిమ్ముకుంటున్నారు. వాళ్ళల్లో నేను కూడ వో పిల్లవాడిలాగ, నీళ్ళు జిమ్ముతూ ఆడ్తున్నా" అని చెప్తూంటే, ఎవరా పిల్లలు? హిందువులా, ముస్లింలా, లేక సిఖ్ఖులా? అని డాక్టరు అడిగాడు. "పిల్లలు! అంతే" అన్నాను. 'సరే, చెప్పమన్నాడు. మళ్ళీ ఆరంభించా – "పంటలయ్యాక ఓ పొలం.... ఆకాశపుటెత్తున సువర్ణ ధాన్యపు రాశి... బాయ్ సాకీ పండుగ... ధోలాక్ పాట! వినాలి!...." అని చెప్తూంటే–

"ఎవరు పాడ్తున్నారాపాట?" "స్త్రీలు"

"అది సరే, హిందూస్త్రీలా, ముస్లిం స్త్రీలా, సిఖ్ఖు స్త్రీలా?"

"పంజాబీ స్త్రీలు; ముస్లింలు, హిందూలు, సిఖ్ఖులు" అన్నాను. డాక్టరు నిరాశతో నిట్టూర్చి, మళ్ళీ ఆరంభించమన్నాడు.

"నాకిప్పుడేమీ విన్పట్టం లేదు. కన్పట్టం లేదు."

"ఏం, ఎందుచేత?"

"నాకు బాగా తలనొప్పిగా వుంది చీకటి! అంతా చీకటి! ఏదో క్రొత్తధ్వని భీకరంగా..."

"చూడు చూడు,... కన్పట్టంలా?"

"ఆఁ.... చూడగలను. మంటలు!" ఆకాశానికంటుతున్నాయి. పల్లెలన్నీ భస్మమవుతున్నాయ్. ధ్వని పెద్దదవుతూంది! అరుపులు, కేకలు, ఆర్తనాదాలు; స్త్రీలు, పిల్లలు, చెల్లాచెదరుగా."

"ఆఁ, వీళ్ళే, నీ కుటుంబాన్ని చంపిన వాళ్ళు, నీ యిల్లు తగులబెట్టినవాళ్ళూ. నీ మనస్సును చెదరగొట్టిన వాళ్ళూ... విను, విను జాగ్రత్తగా విను వాళ్ళేమంటున్నారో"

"నాకేమీ తెలీటల్లేదు ధ్వని... గగ్గోలుగా... ఒక్కమాట మాత్రం – చంపు, చంపు!!.... రక్షించు, రక్షించు, డాక్టర్?"

"ఇప్పుడు, ఇప్పుడే చూడు, విను జాగ్రత్తగా గుర్తుతెచ్చుకో, వాళ్ళెవరో, చంపేవాళ్ళు. తగుటబెట్టే వాళ్లెవరో! నువ్వు ప్రతీకారం చేయాలి! ప్రతీకారం!!"

నాకు ఒక అలారం లాగు మ్రోగినట్లయింది. డాక్టరు నే నెవరినో తెలుసు కోవాలని ప్రయత్నిస్తున్నాడు.

"నే నొక ముస్లింను! సిక్కు సర్దార్ బంధువుల్ని చంపాను. నన్ను రైల్లో రక్షించిన పంజాబు హిందూ యువకుని షాపు లూటీచేశాను, వేనకువేలు హిందూలను, సిఖ్ఖులనూ చంపాను... నేను హిందువును; హకీంసాహెబ్ కొడుకును చంపాను. అనేకమంది ముస్లింలను చంపాను. స్త్రీలను, శిశువుల్ని.... కాదు, కాదు! నేనెవరినో నే తెలుసుకోను. నేను హిందూనూ కాను, ముస్లింనూ కాను, సిక్కునూ కాను. నే నొక మానవమాత్రుడుగానే వుంటాను..." అని అరుస్తూ డాక్టరు ఏదో అడుగుతున్నా విన్పించుకోకుండానే పరుగెత్తాను.

ఎక్కడెక్కడికి పరుగెత్తానో! ఎక్కడకెళ్ళినా–"నేను హిందూని, నేను ముస్లింను, నేనెవర్ని? నేనెవర్నీ కాదు!" అనే మాటలే నన్ను తరముకొచ్చాయ్. ఏయే ప్రాంతాలు, ఏ యే వీధులు, సందులు దాటానో నాకే తెలీదు.

నన్నొక మొద్దు మనిషి ఆపి – "ఏయ్! సాలా, ఎవరు నువ్? ఎక్కడికెళ్తావ్?" అని గద్దించాడు. అతనొక ముస్లిం మౌల్వీ! అతని కళ్ళల్లో ఖూనీ, చేతిలో చురకత్తి కన్పిస్తున్నా, నన్ను తరుముతున్న సమస్యతో నేను–

"నేను హిందూను, నేను ముస్..." అని 'ముస్లిం' అనే మాటను పూర్తి చేయకముందే పస్ మని అతని కత్తి వెన్నులో దిగింది. అదే యిపుడు మీరు చూసే గాయం....

"కాఫిర్ కా బచ్చా" అని మాత్రం విన్నా. ఎంతో కష్టంమీద తల తిరుగుతున్నా స్పృహ తప్పకముందే నడవసాగాను. వెనుక కారుతూన్న రక్తధారతోనే... మీరు నమ్మరేమో... నమ్మొద్దు యీ సమయంలో మీ సర్టిఫికెట్ అక్కర్లేదు...

అట్లాగే ఆ మాటలనుకుంటూనే తూలుతూ యింకో ప్రాంతానికొచ్చానో లేదో... యీసారి హిందూగూండా–

"ఎయ్ ఎవరునువ్? హిందూవా? ముస్లింవా?" అంటూ తన బట్టల్లో నుండి 'ఖుక్రీ' తీసాడు! నేను నా హీనస్వరంతో గొనుక్కుంటూ– "నే ముస్లింను, నేహిం..." అని 'హిందూ అనే మాట రాక పూర్వము ఆ 'ఖుక్రీ' నా కడుపులో దిగింది....

యిపుడీ రెండు గాయాలు ఎట్లా తగిలాయో తెల్సింది మీకు, నన్ను ముస్లిం మూ పొడిచాడు, హిందువూ పొడిచాడు అందుచేతనే డాక్టర్‌సాబ్! నన్ను మీరు బ్రతికించలేరు. మీరు దీనికి ప్రతీకారం చేయ సిద్ధంగా వున్నారు. అప్పుడు, చివరి సారి – నేను హిందూనని చెపితే హిందూవీరులు వెంటనే అమాయక ముస్లింలను చంప సిద్ధమవుతారు. 'నేను ముస్లిం'నని చెపితే యీ ముస్లిం శూరులు హిందూ తెగమీదే ప్రతీకారం చూపుతారు....

నేనెందుకు నవ్వుతున్నానంటే– నేనెవర్నో నాకిప్పుడు జ్ఞాపకం వచ్చింది. నా భార్య, నా శిశువు చంపబడటం నా కళ్ళారా చూశాను. అంచేతనే నా జ్ఞాపకశక్తి పోగొట్టుకున్నాను. ఇప్పుడే ఒక్కొక్కటి స్మరణకు వస్తున్నాయి. నా పొలాలు నా

గ్రామం, నా స్నేహితులు, బంధువులు, యీరుగు పొరుగు... యిపుడు.. నే చావబోయేముందు!

ఇక మీరు వేచివుండటం వృధా! నేనెవరినో ఎన్నటికీ చెప్పను. నన్ను పొడిచిన ముస్లిమూ, హిందూ కూడ తెలిసికోలేరు! పొరబాటువల్ల వాళ్ళవాణ్ణే చంపుకున్నారు. ఇదే నా ప్రతీకారం!– వాళ్ళ యిద్దరిమీదే కాదు – నా వంటి వాళ్ళను వేలకువేలు చంపి పవిత్ర పంజాబును మలినం చేసి, అధోగతికి దెచ్చిన – హిందూ, ముస్లిముల పైన, సిఖ్ఖులపైన యీ ప్రతీకారం!!

"నేను హిందునా, ముస్లింనా? నేను ముస్లింనా, హిందువునా? అనే ప్రశ్నే వారినెల్లపుడూ వెంటాడుతుంది. నగరాల్లోనూ, పల్లెల్లోనూ, ఫ్యాక్టరీల్లోని యంత్రాల ధ్వనిలో.... ట్రాంలూ, బస్సులూ, రైళ్ళ మోతల్లో... గ్రామాల్లోని నూనె యంత్రాల స్వరాల్లోనూ, వాళ్ళు – గాని, వాళ్ళ శిశువులుగాని, శిశువుల శిశువులు గాని 'శాంతి' అనే దాననే తెలుసుకోలేరు! ఘోరాతిఘోరమవుతుంది యీ నా ప్రతీకారం.

చచ్చిన తర్వాత కూడ ఎందుకు నవ్వుతున్నానో మీ కింకా తెలుసుకోవాలని వుందా?

"స్మశానం"

ఉర్దూమూలం : **డాక్టర్ అఖ్తర్ - హుసేన్ రాయెపూరి**

నది ఒడ్డున ఉంది ఆ స్మశానం. ఆ ప్రేత భూమిలో గరికపోచ గూడా మొలవదు. దాని మన్ను పేరుకున్న రక్తంలా నల్లగా ఉంటుంది.

నది ఒడ్డు చెట్ల కొమ్మలు కరువునబడ్డ మనుషుల్లా ఎప్పుడూ మబ్బులవంక చూస్తుంటాయి. ఆ చెట్లపైన రాబందువులు, కాకులు తప్ప మరో పక్షి కూర్చోదు. స్మశానమంత వెడల్పూ బూడిదకాగా మిగిలిన బొమికలు పడి ఉన్నాయి. ఒకటి, అర, పుర్రె మనిషి జీవితాంతం మీద పళ్ళువిప్పి వికృతంగా నవ్వుతుంది.

నదిపాయ జిలజిల ప్రవహిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడో అల నది ఒడ్డు ఒరసి, తల ఎత్తి స్మశానం యొక్క ఉదాసీనత చూచి, తలవంచుకొని మళ్ళీ తనదారిన పోతుంది.

ఆరోజు పట్టణవాసులు ఎవరిదో ఒక శవాన్ని తీసుకవచ్చారు. దాన్ని కట్టెలపైన ఉంచారు. ఒక ముదుసలి దానిపై నేయి చిలకరించాడు. ఒక పసివాడు దానికి నిప్పు చూపించాడు. క్షణంలో కాష్ఠము పేదవాని గుడిసె మోస్తరు మండసాగింది.

మగవాళ్ళంతా ఒకవైపు తలలు పట్టుకొని కూర్చున్నారు. ఆడవాళ్ళంతా ఒకవైపు చేరి ఏడుస్తున్నారు. మంటలు శవంపైకి లేచి యింకేవైనా ఆహుతి దొరుకుతుందేమోనని నాలుకలు విప్పి దిక్కులు కెగబాకుతున్నాయి.

* * *

చీకటి అయింది. సంజరంగులో తడిసిన ఒకటి రెండు మబ్బు శకలాలు, ఆకాశంపైన నెమ్మదిగా పోతున్నాయి. రెండు చుక్కలు బాణము కొనల మోస్తరు ఆకాశంపైన మిలమిలలాడుతున్నాయి. చుట్టుపట్టు నిశ్శబ్దంగా ఉంది. సమీపంలోని మంటల ధ్వని తప్ప మరో శబ్దం వినరావడం లేదు. కమ్మరి అజిబి, పంచె నుండి చిలుము గొట్టం తీసి కాష్ఠంలోనుంచి ఓ ఎర్రని నిప్పుతీసి దానిపైపెట్టి, తన మాటలు శ్రద్ధగా ఆలకించే ఓ వ్యక్తి కోసరం ఆ సమూహంలో వెతికాడు. వాతావరణమంతా దుఃఖ పూరితంగా ఉంది. మృత్యు సమక్షంలో, మనుషులంతా మతితప్పినట్టు కూర్చున్నారు. అజిబి రెండు చేతుల మధ్య చిలుము ఇరికించి గట్టిగా ఓ పీల్పు

పీల్చాడు. ఆ పీల్పుకు చిలుముపైని నిప్పు ఎర్రగా మండింది. నాలుగు అయిదు మణుగురులు పక్కలకు రాలాయి. అజిబి గొణగ నారంభించాడు: "హరి! ఎంత చేస్తివి! గుండు వాడి రొమ్ముకె తగిలింది. నేను మోరిలో దాక్కొని అంతా చూస్తూనే ఉన్నాను. వాడు జండా పట్టుకొని అందరిముందు ఉన్నాడు. ఊరేగింపు నాలుగు బాటల దగ్గరకు వచ్చే వరకూ చూచి, పోలీసువాళ్ళంతా బాట అడ్డుకొని నిలబడ్డారు. సార్జంటు "ఊరేగింపు ముందుకు పోవడానికి వీల్లేదని" హుంకరించాడు. ఊరేగింపులోని వాళ్ళంతా భయపడి పక్కలకు తప్పుకున్నారు. కాని ఈ కుర్రవాళ్ళ గుండెలకే మొక్కాలి! "దారివిడు... మేము ముందుకు పోతాము" అని పోలీసులతో సవాల్ చేసారు....

ఛోటు మాటకు అడ్డం వచ్చాడు. "వెర్రి! ఇన్ని మాటలు... ఎక్కడివి? పోలీసోళ్ళు పిడుగులా పైన పడనే పడిరి. ఉరకడానికే సమయం దొరక్కపోతే? ఉరుకుతు ఉరుకుతు ఎంతమంది పడిపోయారు? గుర్రాల కాళ్లకింద ఎంతమంది కూలిపోయారు? కొందరు కాలవల్లో, కొందరు రోడ్డుమీద, ఎక్కడ చూచిన మనుషులే! మనుషులు: లాఠీ దెబ్బలతో కాళ్ళు చేతులు విరిగినవాళ్ళకు లెక్కేలేదు. ఇందరు ఉరికినా వీడు కదలలేదు చూడు. ఉక్కు స్థంభం తీరు అట్టాగే నిలబడ్డాడు. పోలీసోళ్ళు తుపాకులు చేబట్టి జనం మీదికి వదిలారు. ఇంకేమున్నది? పూత, కాతతో ఉన్న మామిడిచెట్టు కూలినట్టు క్షణంలో నేలకూలాడువాడు" అన్నాడు.

అందరు మౌనందాల్చారు. నిప్పులో ఏమో వెతుకుతున్నట్టు చూచారు. చీకటిలో ఆ చితిమంట భూమిమీద విద్యుత్కాంతిలా ఉంది.

నాయక్ గట్టిగా అన్నాడు.... "రాముని ఆజ్ఞ... కాలం వచ్చి నెత్తిమీద కూర్చున్నప్పుడు ఎవని మాట చెవిని పడుతుంది? కాని దురదృష్టవంతుడు అక్కడి నుంచి పారిపోగూడదా? ఇంతకు నొసటిరాత తప్పదు."

లఖ్ఖుమేస్త్రి కళ్ళువిప్పి అన్నాడు – "నా కొడుకు... పారిపోవటమా? ఎందుకంటారు ఆ మాటలు? వాడి ఆత్మబాధ పడుతుంది. పోతే పోయాడు... కాని నా కొడుకు అందరిలాగా పిరికివాడు కాదు... వాడు పట్టుకొన్న పతాకం యొక్క గౌరవం వాడి మనసులో ఉంది."

"కన్న కడుపుగాని, మూడు జానల గుడ్డతో దేశం యొక్క గౌరవ మర్యాదలు రావు. పోవు. నేనెందుకు అంటున్నాను. నీ నుంచి ఆలోచించే అంటున్నాను? మీవాడు చచ్చినందుకు నాకు దుఃఖంగా లేదా? నేను అనేది ఎందుకు తెలుసా? ఈ

ముసలితనంలో నిన్ను ఎవడు పోషిస్తాడు? వయసు వచ్చిన కొడుకు, ఇంటికి పెద్దవాడు, చిన్నచిన్న పిల్లలు.... ముసలి తలిదండ్రులు.... వీళ్ళంతా ఏ గంగలో దూకాలి? దేశం నీకు అన్నం పెడుతుందా?"

* * *

లఖ్ఖు ఒక దీర్ఘ నిశ్వాసం తీశాడు. నిజమే అంటున్నాడతను, తనగతి ఏమికావాలి. దేశము! దేశము! దేశం ధనవంతులది... పేదవాళ్ళకు దేశం లేదు... భూమిపన్ను, నీటి పన్ను... వెలుగు పన్ను... చచ్చిపోయిన తరువాత స్మశాన వాటిక పెత్తందారు పన్ను... యివన్ని గడిస్తె, దేవుని గుడిలో పూజలు .... వెండి సింహాసనం మీద భోగాలు అందుకునే ఆ దేవుడు, తన కొడుకు చావప్పుడు ఎక్కడ పోయాడు?

ఇంతలో శంభు అన్నాడు – "ఇవాళ ఉదయం వరకు చక్కగా ఉన్నాడు. ఒక్కొక్క సమ్మెట దెబ్బతో ఇనుమును గడ్డిపోచలాగా వంచేసేవాడు. కాని చిత్రం! ఓ సీసపుగుండు గాలిలో సంయ్‌ని వచ్చి, ఏమి మాట్లాడకుండా రొమ్ములోదూరి, ఎముకలు విరగగొట్టి మాంసాన్ని చీల్చి–గుండెల్లో కూర్చుంది. వాడిపని అంతమైంది. .... జీవించడమెంత కష్టం? చావు ఎంతో సులువు?"

అజిబి అన్నాడు–"మనిషి చచ్చిపోతే మిగిలిపోయే దేముంది? పేరేమో పెద్దలకు వస్తుంది. పేదల త్యాగం అడిగేది ఎవరు? ఏదో తలిదండ్రుల పేద మనస్సులు మీద జ్ఞాపకము జీవితమున్నంతవరకు మానని గాయంలా బాధిస్తూ వుంటుంది. కాలం గడచిన కొద్ది ఆ జ్ఞాపకమూ మారిపోతుంది. ఎవడిపనిలో వాడు పడిపోతాడు. ఎప్పుడైన జ్ఞాపకం వస్తే ఏదో పూర్వజన్మల కథలా తడుతుంది."

లఖ్ఖు మౌనంగా కూర్చున్నాడు. తన కొడుకు చేతిలో జండాపెట్టిన పెద్దలు ఎక్కడ? ఏరీ ఒక్కరూ లేరు! వాళ్ళంతా నాయకులు. పేదల స్మశానంలోకి వాళ్ళెందుకొస్తారు? కాని లఖ్ఖు కొడుకు తెలివి తక్కువగా వర్తించాడా? ఏమి అనుకొని జండా చేతపుచ్చుకున్నాడు? గుళ్ళ వర్షం ముందు రొమ్ముపిప్పి ఎందుకు నిలబడ్డాడు? ఏమి–వాడికి తనవాళ్ళమీద మమకారం లేదా?

ఆడవాళ్ళ ఏడ్పులు మందగించిపోయాయి. దుఃఖంతో ఎర్రబారిన కళ్ళతో వాళ్ళు కాష్ఠము వైపు చూస్తున్నారు. శవమంతా బూడిద అయింది.

లఖ్ఖు శరీరం దుఃఖంతో వణకదొడగింది. ప్రపంచమంతా కృతఘ్నతా పూరితమైంది ఏమిటి?

తన కొడుకు తనను మరచి, దేశం కోసరం ప్రాణమిచ్చాడు. వీళ్ళేమో వాడిమీద నేరాలు వేస్తున్నారు.

ఇంతలో ఛోటు ఏదో భయంకరమైన విషయం జ్ఞప్తికి వచ్చినట్టు దిక్కులు చూచాడు.

"కరీమ్‌ఖాన్ హవల్దారు పీనుగతో పోయిన వాళ్ళపేర్లు పైకి రిపోర్టుచేస్తా నన్నాడు" ఛోటు తెల్లముఖం వేసి అన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకూ! గవర్నమెంటు ద్రోహి... అరె! ఇది తెలియదా నీకు? గవర్నమెంటు మీద గుండు కాల్చకపోతే మాత్రమేమి? గవర్నమెంటు గుండుతో చావలేదా?

"సరే! చెప్పావు కావేమి!" నాయక్ బట్టలు దులుప మొదలెట్టాడు. "నిజమే, వీడు అటువంటి, యిటువంటి వానితో చావలేదు. గవర్నమెంటు గుండుదెబ్బకు చచ్చాడు... చాల చిక్కు వ్యవహారమే..."

అజిబి లేచి దిక్కులు చూడదొడగాడు, "నాయనా! ఈ వ్యవహారాలతో మనబోటి వాళ్ళు దూరముండటమే మంచిది... కరీమ్‌ఖాన్ తక్కువవాడు కాదు. పెద్ద మహారాజులే వాని పేరు వింటే వణుకుతారు. ఇవాళ ఎవనింట కన్నం వేయించాలన్నా వాడు వేయిస్తాడు. ఎవనిమీద దొంగతనము మోపి అరెస్టు చేయించాలన్నా చేయిస్తాడు. ఇవాళ పట్టణమంతా వాడి రాజ్యమే."

కరీమ్‌ఖాన్ భూతం చీకటిలో నుంచి పొంచి చూస్తున్నట్లు అంతా భయపడి దిక్కులు చూడదొడగాడు. చుక్కల కాంతిలో, చెట్టుకొమ్మలు తమ బలహీనపు చేతులు చాచి చీకటినేమో అడుగుతున్నాయి.

లఖ్ఖు మోకాళ్ళపై తలపెట్టి మతి తప్పినట్లు కూర్చున్నాడు. ఒకలొకళ్ళు అంతా జారిపోయారు. మంట చల్లారేసరికి ముగ్గురు నలుగురు మిగిలిపోయారు.

లఖ్ఖు లోలోన ఏడ్వసాగాడు. ఒకరోజు కాకున్న ఒకరోజు అందరు ఇదే నిప్పులో బూడిద కావలసి వస్తుంది. ఈ ప్రవహించే నీటిలో ఆ బూడిద కొట్టుక పోవలసిందే. కాని దేశభక్తులమని చెప్పుకునే ఆ పెద్దలు ఒక్కడు ఇటు ముఖం చూపలేదు. చచ్చినవాడి కోసరం తపిస్తున్న వాడి భార్యను ఊరుకోమన్న మానవుడు లేడు. తెలివితప్పి పడివున్న తల్లిని లేవదీసినవాడు లేడు.

సేట్ ఛచ్చుమల్ కాంగ్రెసు కమిటీ పెద్ద. కొడుకు ప్రాణం పోయాక గూడా వాని అప్పు రద్దుచేయడా?

కుమార్ ప్రతాపసింగు గొప్ప దేశభక్తుడు. కరీమ్‌ఖాన్ క్రూరహింస నుండి, ఈ ముసలివాళ్ళను కాపాడడా?

వర్షాకాలం సమీపిస్తుంది. ఇల్లంతా కారుతుంది. గోడలు పగుళ్ళు చూపినవి. కాని తన చేతుల్లో పూర్వపు శక్తి లేదు. కూలివాని కొడకు చిన్న గుండు తగిలి ప్రాణాలు విడిచాడు. నిప్పు వాడిని బూడిద చేసింది.

కాష్ఠము చల్లారింది. మగవాళ్ళు దానిపై నీళ్ళు చల్లారు. ఆడవాళ్ళు తమ కన్నీటితో తడిపారు. నారాయణ అనే కేకలతో బయలు ప్రతిధ్వనించింది. దూరం నుంచి నక్కలు హువా హువా అని జవాబు యిచ్చాయి.

అందరూ యిళ్ళకు పోవడానికి లేవగానె లఖ్ఖు తన కాళ్ళ దగ్గర ఏదో గుడ్డపడి ఉండటం చూచాడు.

ఇది ఈ త్రివర్ణ పతాకం. తన కొడుకు గుండెలపైన అదుముకొని ప్రాణాలు విడిచిన పతాకం – పతాకమెంతో నలిగి ఉంది.

కాని రక్తంతో తడసి అది ఎర్రనైంది. లఖ్ఖు దానిని చేతదీసుకున్నాడు. ఈ గుడ్డపేలికలో ఏమి మహత్యముంది? ఈ గుడ్డపేలికపైన మనుషులు ప్రాణాలిస్తారు. మామూలు వడుకునూలుగుడ్డ, అద్దకం వాడు దానిపై రంగునీళ్ళు చల్లాడు.

ఏదైనా అది మనిషి రక్తంతో తడిసిపోయింది. వేడిరక్తం – అరుణారుణ రక్తం. ఒకసారి లఖ్ఖు హృదయంలో ఒక ఆలోచన మెరిసింది. తన యింట్లో గూట్లో ఉన్న రాతి విగ్రహాన్ని తీసివేసి, దాని స్థానంలో రక్తముతో తడిసిన పతాకమును ఉంచాలనే ఆలోచన తట్టింది.

ఆడవాళ్ళు శోకగీతాలు పాడుతూ అక్కణ్ణుంచి బయలుదేరారు. తేలికగా ఉంది గాలి. రాత్రి మంచుతో తడిసి ఉంది. దూరం నుంచి నది గలగల ధ్వని వినపడుతూంది. భూమి వేడి చల్లారిపోయింది. ఆకాశం పైన చుక్కలు మెరుస్తున్నాయి.

ఓరి మూల్యం

రచన : **మహమ్మదు అబ్దుల్ ఖాదర్ ఫరూకి**

అబ్బాయి! నీ వయస్సు ఎంతో ఉన్నట్టుగా కనపడడం లేదు... ఏదైనా స్త్రీ మోహంలో పడి ఈ దురవస్థకు గురి అయినావా?" షాము అడిగాడు.

"స్త్రీ!" యువకు డన్నాడు "ప్రపంచంలోని స్త్రీలంతా అయితే నా తల్లులో, నా సోదరీమణులో, లేకపోతే అంతకంతా నా శత్రువులో...."

"లేకపోతే ఏదైనా ధనోర్జనోపాయంలో పడి ఈ కష్టాన్ని కొనితెచ్చుకున్నావా?"

"ధనము!" ఆ యువకుడు వ్యంగ్యంగా అన్నాడు. "అది ప్రభుత్వపు యినుపపెట్టెల్లో బంధింపబడి ఉంది. దాని చింతతో మాకేమి ఒరిగేది లేదు... అసలు అది మా దగ్గర నిలిచేది ఎప్పుడు? ఏదో కొద్దిసేపటికి మా చేతిలోకి వస్తుంది... మళ్ళీ ఎక్కడ నుంచి అయితె వచ్చిందో, అక్కడికే పోయి చేరుతుంది. మా మనస్సుల ఉప్పొంగచేసే అంత ధనం దేశంలో ఎక్కడుంది?"

"ఆడదో, అర్థమొ కాకపోతే వేరే కారణ మేముంటుంది? ఎన్నో ఏళ్ళ నుండి నేను జైలు కొలువు చేస్తున్నాను. నా తండ్రి, నా తాత, నా ముత్తాత వాళ్ళ జీవితాలన్నీ ఈ జైలు కొలువులోనే అంతమై పోయినాయి. ఆడది, లేక అర్థము – ఈ రెంటికి సంబంధించినవి తప్ప మరో వ్యవహారం యిక్కడికి రావడం నేను ఎరుగను."

"మాతృభూమి పాదాలకు అర్పణ చేస్తున్నాను."

"అవును... మరిచాను. భూమితోగూడా యిటువంటి చిక్కు లేర్పడుతాయి. కాని అది ఏ గజమొ, రెండుగజాలో, యింటి స్థలం కోసమో, లేక దారి నడిచే హక్కు కొరకో, లేక ఏ చిన్ని కొండ్రకొరకో అయి ఉంటుంది. కాని ముష్టి నేల కోసరం లక్షల విలువచేసే ప్రాణాన్ని యిట్లా ఆపదల్లో తోయడం..."

"వెర్రివాడ! మాతృభూమి అంటే అది కాదు. నీ, నా, లాంటి కోట్లాది ప్రజలు ఏ దేశంలోనైతే పుట్టి పెరిగారో, దానిని మాతృభూమి అని పిలుస్తారు". యువకుని కళ్ళలో నుంచి ఒక ప్రత్యేక కాంతి బయలుదేరింది. విప్లవకారుడా యువకుడు. ఎంతో అందంగా – ఎంతో సౌష్టవంగా ఉన్నాడా యువకుడు. యువకుని విశాల

ఫాలముపైన మెత్తని వెంట్రుకల కుచ్చులు అదో విధంగా జారి ఉన్నాయి. కళ్ళు ఎంతో నిర్మలంగా ఉన్నాయి. అతను దేశ స్వాతంత్ర్యార్థం ఓ హత్య చేశాడు. హత్యానేరం క్రింద ఆ యువకునికి ఉరిశిక్ష విధించబడ్డది. చాలాకాలం నుండి మానవుని సానుభూతి అంటే ఏమిటో చవిచూచి ఎరగని ఆ యువకునికి, షాము తనను గూర్చి సానుభూతిగా మాట్లాడడం కొంచెం ఆశ్చర్యం వేసింది.

యువకుడు ఏమో ఆలోచించసాగాడు.

"మనమంతా మట్టిలోనుంచే వచ్చాం. తుదకు అందరం ఒకనాడు మట్టిలోకే పోవలసి ఉంది. పూవులు... తీగెలు... పండ్లు... కాయలు కనపడే సమస్తమూ అంతా మట్టిలో కలిసేదే.. మానవుని ప్రయత్నాలన్నీ వృధా" అన్నాడు షాము.

"ఏమిటి నా గూర్చి చాలా చింతపడుతున్నావు? ఎవరు తాతా నువ్వు?

"నాపేరు షాము. నిన్ను ఉరి తీసేపని నాపైన వేశారు."

"ఉరి! ఈరోజుకాదె!" తెప్పరిల్లి అన్నాడు.

"నీ పొడవు, బరువు చూచుకోడానికి వచ్చాను."

"నిన్న అందుకే కావచ్చు. జైలరు నన్ను తూపించాడు. బరువు చూడటం దేనికి?"

"డ్రాప్ వేయడానికి, మనిషి బరువు, పొడవును బట్టి బల్లనుంచి భూమి మీదికి డ్రాప్ వేస్తారు. డ్రాప్ చక్కగా పడితే ఒక్క ఊపుతో ప్రాణం పోతుంది. శరీరానికి ఏమీ కాదు."

"కానీ నీ అవస్థ ఏమిటో చెప్పు?"

"మా అవస్థ అడిగేది కాదు. మా అవస్థ మాకే తెలియాలి. ఇరవయి నాలుగు గంటలూ మూడు తాళ్ళను పురివేసి చాల గట్టిగా, మెత్తగా, నలుసు లేకుండా ఉరి త్రాడు పేనవలసి ఉంటుంది. ఖైదీమెడ ఏ మాత్రము పికిలినా మా తలపైన పడుతుంది. మొదట జైలరు ఉరిత్రాడు పరీక్ష చేస్తాడు. ఆ తరువాత మాకు ఆజ్ఞ దొరుకుతుంది. సూపర్నెంటు, డాక్టర్, వీళ్ళంతా గడియారాలు చేత పుచ్చుకొని కూర్చుంటారు. ఒకటి రెండు నిమిషాలు, అలస్యమైతే సిమ్లా నుండి తంతులపైన తంతులు వచ్చి పడుతుంటాయి. నిర్ణీత సమయానికి పని పూర్తి అయితే సరే,

లేకపోతే ఉరి మా తలపైన పడుతుంది. పని పూర్తి అయ్యేవరకు మా ప్రాణంలో ప్రాణముండదు."

"ఎందుకోస మొచ్చిన అవస్థ నీకిది?"

"పొట్ట..."

"ఏమిస్తారు మీకు?"

"అయిదు రూపాయలు."

"అయిదు! ఒకళ్ళ చావుమీద నీ బ్రతుకు ఆధారం చేసుకున్నావు."

"నేనేమిటి? లోకమంతా యిట్లాగే ఉంది. పేదవాళ్ళం కాబట్టి అపకీర్తి పాలౌతాము. మేము చేతులతో ఈ పని నిర్వహిస్తే, ఇతరులు నోటితో, కాగితపు రాతలతో పని పూర్తిచేస్తారు. ఇంత అయినా పొట్టకే చాలదు. ఏడాది పేరిట ఒక సారినాకు సమయమొస్తుంది. వకీళ్ళు మా దగ్గర వరకు నేరస్థులను రానివ్వకనే పోయిరి. ఒక షోలాపూరు, బొంబాయి అల్లర్లప్పుడు మాత్రం మాకు నిశ్చింతగా ప్రొద్దు గడిచింది. నా దురదృష్టం కొద్దీ నాకు మరొకరు పోటీ తయారయ్యాడు. ఆదాముగాడు ఎప్పుడూ జైలు గేటువద్ద కూచొని వచ్చిపోయే, అధికారుల అరికాళ్ళు నాకుతుంటాడు. నేను కొంచెం వెనకైతే నాకు వచ్చే పని వాడు కాజేస్తాడు. ఇంట్లో నా ముసలితండ్రి దమ్ములోగంతో బాధపడుతున్నాడు. డాక్టర్లు తాళం చెవిమార్కు సీసా తాగించమంటారు. దానిని కొందామంటే ఎప్పుడూ పైసా కనపడదు. అడది పురిటిగదిలో కూచొనుంది. కాబూలివాని దగ్గర అప్పు పెరుగుతూ ఉంది. పేదలగోడు ఎవళ్ళ చెవికెక్కదు."

"షాము, ఒక తెల్ల కాగితం, రెండు కోడి ఈకలు తెచ్చిస్తావా?"

"ఎందుకు?"

"నన్ను ఈ లోకం నుండి సాగనంపే అమరుడా? నిన్ను కాగితంపై చిరంజీవిని చేస్తాను."

"అబ్బో, జైలుకామాను చాలా కఠినంగా ఉంది... అసలు ఖైదీలతో మాట్లాడటమే తప్పు."

"కనీసం బొగ్గు అయినా చూడు."

దగ్గర చెత్తపోగులో షాము ఓ బొగ్గు వెతికి తీసుకొచ్చాడు. యువకుడు తెల్లతెల్లని గోడపై బొమ్మ గీయనారంభించాడు. షాము ఉరితాడు పట్టుకొని గడపలో కాలుపెట్టాడు. ఎడమచేతిలో కాగితపు నోటు ఉంది. ఆ డబ్బు కోసరము గొంగళి కప్పుకొని దగ్గుతున్న ముసలి తండ్రి పురిటి పాపకు పాలిస్తూ నులక మంచంలో పడుకొని వున్న భార్య జింకకాలు చుబుకము పట్టుకొని కోరచూపులు చూస్తున్న కాబూలీవాడు, తమ పాశాలతో షామును తమతమవైపు లాగుతున్నారు. యువకుడు బొమ్మకు రూపురేఖలు కల్పిస్తున్నాడు.

ఇంతలో రాముగాడు వచ్చి షాముపై విరుచుక పడ్డాడు.

"అరేయి! నాకు యిచ్చిన పనిని నువ్వు అందుకున్నావు కాదూ. నా పిల్లల నోటి దగ్గర ముద్ద తీసుకున్నావు. వరె! జ్ఞాపకముంచుకో. నేను నిన్ను జైలులో కాలు పెట్టకుండ చేస్తేనే నన్ను రాము అను."

"అరేయ్! మళ్ళా యిక్కడికి జేరినవా? నాకు మంట ఎత్తితే నీతల రెండు ముక్కలవుతాది." సంతోషంతో తన బొమ్మను చూస్తున్నవాడల్ల తిరిగి అన్నాడు షాము.

"నా తల పగలకొడతావు కాదు? యిప్పుడే చూపిస్త.... గంటల కొద్దీ ఖైదీలతో మాట్లాడుతుంటావు... జైలరుదొర రానియ్యి..."

వాళ్ళిద్దరు ఒకణ్ని ఒకరు తిట్టుకుంటు బయటికి పోయారు. యువకుడు బొమ్మ గీయడంలో లీనమైపొయ్యాడు. అతని మనస్సంతా బొమ్మపై ఉంది. సెల్లు దరవాజా ముందు జైలరు ప్రత్యక్షమయ్యాడు.

"మిస్టర్ దాస్ – నీవు ఆ బొమ్మపేరు ఏమి పెట్టావు?"

"ఉరిమూల్యము...." యువకుడు బొమ్మకింద రాస్తూ అన్నాడు.

"నీ కళచూచి చాలా చింతిస్తున్నాను... నీవు అనవసరంగా విప్లవోద్యమపు ఉరి మెడకు వేసుకున్నావు. నీ కళాసేవలో నీవు నిమగ్నుడవైతే దేశానికెంతో లాభమయ్యేది."

"ఏ ఉత్సాహం, ఏ ఆవేదన, నన్ను చిత్రకారునిగా చేసిందో, ఆ ఉత్సాహము, ఆ ఆవేదనే నన్ను విప్లవకారునిగా చేసింది."

"అడవి కాసిన వెన్నెల..." జైలరు నిట్టూర్పు విడిచిపోయాడు.

సాయంత్రం ఆరు గంటలైంది. షాము తన గుడిసె ముందు కూర్చొని ఉరి త్రాడు తయారు చేస్తున్నాడు. ముసలి తండ్రి గొంగళి కప్పుకొని గడపలో కూర్చొని దగ్గుతూ కొడుకుకు తన కాలంనాటి అనుభవాలు చెప్పుతున్నాడు.

"షాము... సర్కారు పనుల్లో ఎప్పుడు జాగ్రత్తగా వుండాలి. కానూను చాలా కఠినమైంది. చేతులు చీలిపోయినా ఫరవాలేదు. కాని తాడు బాగుండాలె. నీవు ఎవడి కొడుకువో జ్ఞప్తి వుంచుకో. నేను రాజ్యమంతట పేరు మోసిన దొంగ, డొంగరు సింగును ఉరి తీసినాను. నా తండ్రి, కోటికి పడగెత్తిన పన్నాలాల్‌కు ఉరిత్రాడు తయారు చేశాడు. తాడు మెత్తగా, కఠినంగా, బలంగా ఉండాలె. నా తాత ఉరిత్రాడు పేనడంలో చాలా దూరం పేరు మోసినవాడు." ముసలివాడు దగ్గుతు తన తాత తండ్రుల వీరగాధలన్నీ చెప్పసాగాడు. షాము భార్య ఈ గాధలన్నీ వింటూ, "నా తండ్రి పుట్టిన గడియ మంచిది" అని కొడుకును ముద్దాడింది. భార్య పురిటి బాలుని ముద్దాడుతుంటే షాము లోలోన పొంగిపోయాడు.

* * *

తెల్లవారుజామున జైలు అలారం గణగణ మ్రోగనారంభించింది. ఖైదీలంతా ఉలికిపడిలేచి ఎవరో ఈ జైలు కష్టాల నుంచి శాశ్వతంగా విముక్తి కాబోతున్నాడని వాళ్ళలో వాళ్ళు అనుకున్నారు. ఉరితీసే గద్దెదగ్గర, జైలరు, సూపర్నెంటు ఏవో సన్నాహాలు చేస్తున్నారు. సర్జను, మెజిస్ట్రేటు అంతా కుర్చీలపై సీరియస్‌గా కూర్చున్నారు. షాము ఒక మూల నిలబడి ఉన్నాడు. షాము ఎంతో పెందలకడ వచ్చాడు. ఉరికొయ్యకు తాడువేసి పొడువు కురచలు చూచుకున్నాడు. తన పని సరిచూచుకొని నిశ్చింతగా నిలబడ్డాడు. వాడి ముఖం వికాసంగా వుంది.

ఇంతలో ఉరితీయబోయే యువకుణ్ణి అక్కడికి తీసుకొచ్చారు. యువకుడు చిరునవ్వుతో అక్కడనున్న వాళ్ళందరితో "సెలవు" అంటూ పెళ్ళికొడుకు గుర్రము ఎక్కబోయినట్టు ఉరిగద్దె మెట్లు ఎక్కిపోయాడు. మేజిస్ట్రేటు అతణ్ణి, ఉరితీర్పు, వినిపించడానికై ఆపాడు. షాము తన చేతుల్లో దుర్మరణముపాలు కాబోతున్న ఆ యువకుని వింత నిర్లక్ష్యం వైపు విభ్రమంగా చూడదొడగాడు. మేజిస్ట్రేటు తీర్పు వినిపించబోయాడు. ఇంతలో టెలిగ్రాపు ఆఫీసు నుండి ఒక నౌకరు పరుగెత్తుకొని

వచ్చి సూపర్నెంటుకో కవరు అందించాడు. సూపర్నంటు కవరు చింపి రెండు పంక్తులు చదివాడో లేదో – అతని ముఖంపై సంతోషం పరుచుకపోయింది. టెలిగ్రాము ముగించి అతను, చిరునవ్వుతో ఆ యువకునితో చేయి కలిపి – "మిస్టరు దాసు.. నీవిప్పుడు మా ఖైదీగా లేవు. నీవు మామూలు పౌరునివైపోయావు. ప్రభుత్వము నీ తప్పును మన్నించి నీ శిక్ష రద్దుపర్చింది. నేను మళ్లీ ఒకసారి నిన్ను అభినందిస్తున్నాను." ఈ సంతోషవార్త అక్కడ మూగినవాళ్ళందరిలో ఆనంద తరంగాలుప్పొంగ జేసింది.

షాముకు ఇంగ్లీషులో జరిగిన ఈ సంభాషణలు ఏమీ అర్థం కాలేదు. మొత్తంపైన తన వ్యవహారం ఏదో కిందమీదు అయిందనుకున్నాడు. నోరువిప్పి అధికారుల ముఖం చూస్తూ వున్న షాముతో, "శిక్ష రద్దు అయిపోయింది. నీవు అవసరం లేదు" అన్నాడు సూపర్నెంటు.

"హుజూర్... శిక్ష.. రద్దు అయిందీ...? నా ఫీజు..."

షాము మాటలు ఎవరూ చెవిని వేసుకోలేదు. జైలరు యువకుణ్ణి తన ఆఫీసు గదిలోకి తీసుకొనిపోయి అతని స్వంత వస్తువులన్ని తెప్పించి, ప్రయాణపు ఖర్చుల క్రింద అయిదు రూపాయలు చేతికిచ్చి, "నీకు యింకా అవసరమైతే చెప్పు" అన్నాడు.

"నాకు ఇవి కూడా అవసరం లేదు... కాని ఈ రూపాయలతో ఎంతవరకు టిక్కెట్టు దొరికితే అంతవరకు పోతాను."

"నీవనే మాటలను బట్టి నీవు ఇంటికి పోవడంలేదని తెలుస్తుంది."

"నెలవు"

యువకుడు జైలు గేటు దగ్గర షాము ఉంటాడనుకున్నాడు. ప్రయాణ ఖర్చుకై దొరికిన అయిదు రూపాయలు షాము చేతిలో వేయాలని యువకుడు నిశ్చయించుకున్నాడు. కాని షాము, వెతికినా కనిపించలేదు. యువకుడు నిరాశగా స్టేషనువైపు నడక ఆరంభించాడు. కొంతదూరం పోయే వరకూ జన సమూహమంతా ఒక దిక్కు గుమిగూడడం అతనికి కనిపించింది. యువకుడు జన సమూహాన్ని చీల్చుకొని లోనికి పోయేడు. కొంతకాలం ముందు తన్ను పరలోకానికి అంపడానికి వచ్చిన షాము, వంటినిండ గాయాలతో తెలివితప్పి పడి ఉన్నాడు. యువకుడు వంగి తన పంచె చెరుగుతో రక్తముతో నిండిన వాడి ముఖాన్ని తుడిచి, చుట్టు

వున్నవాళ్ళతో "ఏమిటి" అని అడిగాడు. కాబూలివాడికి షాముకు డబ్బు వ్యవహారంలో తగాదా అయినట్టు, తగాదా ముదిరి చేతులు కలిసినట్టు, కాబూలి వాడు షామును ఎత్తి బండపైని విసిరినట్టు, అక్కడివాళ్ళు చెప్పారు. కాబూలివాడు పరుగెత్తడానికి సిద్ధపడగా ప్రజలు వాణ్ణి పట్టుకొని పోలీసుల కప్పగించారని అన్నారు.

కొంతసేపటికి షాముకు తెలివి వచ్చింది. కళ్ళువిప్పి యువకుణ్ణి చూచాడు. "బాబు... రాముగాడు చాలా అదృష్టవంతుడు. కాబూలి వాని మూల్యం వాడికి దొరుకుతుంది." షాము ఇంకా ఏమో అనబోతుండగా ఇంతలో రొమ్ములో నుండి పెద్ద నొప్పివచ్చినట్టు అయి లేవబోయినవాడు మళ్ళీ వెనుకకు పడ్డాడు. షాము మూసినకళ్ళు శాశ్వతంగా మూతపడిపోయినాయి.

పేదల కలలు

మూలం : **కిషన్ చందర్** అనువాదం : **కె. విజయ్‌కుమార్**

మహాలక్ష్మి వంతెనకు దగ్గర్లోనే ధనదేవత ఆలయం వుంది. ధనదేవత ఆలయమంటే అర్ధం గుర్రపు పందాలాడే చోటు అని. ఆరాధకులకు అపజయమే కాని, జయముండదు; ఈ ప్రదేశాన్నానుకుని మురుగు కాలువ తూములు, పట్టణం అవతలికి పోతున్నాయి. గుర్రపు పందాలాడే ప్రదేశానికీ, మురుగు తూములున్న చోటుకూ మధ్యగా మహాలక్ష్మి వంతెన వుంది.

వంతెనకు ఎడమప్రక్క ఇనుప కర్రలకి ఆరు చీరలు ఆరవేసి వున్నాయి. ఇప్పుడే ఉతికి ఆరవేసినట్లు తడిగా కన్పిస్తున్నాయి. చీరలను నేసినవాళ్ళు పేదవాళ్ళు, అదే విధంగా ఆ చీరలు కూడా పేదవే. ఎరుపు, లేతనీలం, ముదురు నీలం, బూడిదరంగు, గోధుమరంగు, ఊదా ఎరుపు! రైలులోంచి బయటకు తొంగిచూసే ప్రయాణికులను ఈ రంగులు వెలవెలబోతూ పలకరిస్తాయి. పలకరింపు ఒక్కక్షణం మాత్రమే; మరో క్షణంలో రైలు వంతెన క్రిందనుంచి 'లోవర్ పారెల్' వైపు మళ్ళిపోతుంది.

కొన్నప్పుడీ చీరల రంగులింత అసహ్యంగా వెలిసిపోయి వుండవు. అయితే ఇవి సరిక్రొత్తవిగా ఉన్నప్పటి స్థితి మాత్రం నాకు తెలియదు. ఇప్పుడవి నాసిరకం; వెలవెలబోతున్నవి. అక్కడక్కడ చిరుగులు నల్లని దారంతో కుట్లు కొన్ని చోట్ల కుట్టు ఊడిపోయాయి. మరికొన్ని చోట్ల అతుకులు, మాసికలు. ఎంతరోతగా వున్నాయ్!

వీటి చరిత్ర నాకు బాగా తెలుసును. ఏమీ అంటే, ఈ చీరలను ధరించే మహిళామణుల చరిత్ర నాకు కొత్తది కాదు కనుక. మహాలక్ష్మి వంతెనకు ప్రక్కగా వున్న కూలీపేటలో ఈ మహిళలు నివసిస్తున్నారు. వీరి దౌర్భాగ్య జీవిత చరిత్ర వినడానికెంతో విచారంగానే వుంటుంది మరి! అది నీలంచీర; దాని ప్రక్కనే ముదురు నీలపు రంగు చీర – వాళ్ళ జీవితాలవలెనే, ఈ చీరల రంగులలో భేదమేమీ కనిపించదు.

సరే వినండి, ఆ జాగా ఎడమ వైపున ఉన్న ముదురునీలం చీర బీనాబాయిది. దానిప్రక్కన ఉన్నది జీవనబాయిది. బీనాబాయి జీవితంలాగానే ఆమె చీర కూడా వెలిసిపోయింది. బీనాబాయి ధనవంతులు యిళ్లల్లో పాచిపని చేస్తుంది. ముగ్గురు

కూతుళ్ళు యిద్దరు కొడుకులు చేతిపిల్ల పెద్ద పిల్లకు ఆరేళ్ళు. బీనాబాయి భర్తకు బట్టల మిల్లులో పని. ఉదయమే పనిలోకి వెళ్ళిపోతాడు. బీనాబాయి చీకటి ఉండగానే పాచిపనికి వెళ్ళి పోతుంది. పనిపాటలు నేర్పాలని ఒక్కొక్కసారి పెద్ద పిల్లను వెంట తీసుకుపోతుండేది... యింటికి వచ్చేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలయ్యేది. అప్పుడు వంట చేసుకునేది.

బీనాబాయి యింట్లో పొయ్యి మాత్రం అందరి యిండ్లలో పొయ్యిలు ఆరిపోయినప్పుడు గాని వెలిగేది కాదు. మధ్యాహ్నం రెండింటికి, రాత్రి పది గంటలకు! తల్లికి పెద్ద కూతురు సహాయపడుతుంది. తల్లి గిన్నెలు పళ్ళాలు తోమితే కూతురు కడుగుతుంది. కడుగుతూ ఒక్కొక్కసారి కొన్నిటిని పగులగొడుతుంది. ఏడ్చి ఏడ్చి ఆ పిల్ల కల్లు వాచి ఉబ్బినట్లు అప్పుడప్పుడు కనిపిస్తుంటాయి. ఎందుకాపిల్ల అంత దుఃఖించాలి? బహుశా ఎవరింట్లోనో పాత్రలు కడగబోతూ, పగలగొట్టి వుంటుంది. చీవాట్లు తిని వుంటుంది! తల్లి, పిల్లను తిట్టుకుంటూ యింట్లోకెళ్ళి పొయ్యి రాజేస్తుంది. ఆ స్థితిలో ఎప్పుడూ పొగ రావడమే గాని పొయ్యి మండనేమండదు. పొగకు ఊపిరాడక చిన్న పిల్లలు ఏడుస్తారు. తల్లి తిట్టి నాలుగు బాదుతుంది. పిల్లలు ఏడుస్తూ వుంటారు. తల్లి తెగతిట్టుతూ ఉంటుంది. ఆ చంటిపిల్లడెప్పుడూ గుక్కపట్టి ఏడుస్తూ ఉంటాడు. నవ్వుతుండగా నేను ఎప్పుడూ చూడలేదు. చంటిబిడ్డ కొంచెంమైనా నవ్వక ఎప్పుడూ కేక పెడతూ ఉంటాడు. కారణం పాపం, వాడికెప్పుడూ ఆకలే! మహా ఉంటే రెండేళ్ళు ఉంటాయో ఉండవో గాని ఒక్క పాల చుక్క అయినా వాడినోటికి అందదు. పాలు చాలా ప్రియం. మా వీధిలో ఇతర పిల్లలలాగ ఏదో సంతతిని పడివుండవలసిందే గాని పాలు ఎక్కడివి? మా పిల్లలకు ఆరు నెలల వరకే తల్లిపాలు ఉంటాయి. తరువాత డబ్బాపాలే; నీళ్లు-డబ్బాపాలు ఎండలో తిరుగుతూ ఉంటారు. రాత్రిళ్ళు చింకి గుడ్డలతో నిద్రపోతారు! చిన్నపిల్లల మాటకేమి, పెద్దవాళ్ళ స్థితి యింతే.

మెలకువగా ఉంటే ఆకలి. రొట్టె నీళ్ళు త్రాగి వాళ్ళు పెరుగుతారు. ఆకలి కూడా వాళ్ళతోపాటే పెరుగుతుంది. కడుపులో, గుండెల్లో, మెదడులో సుత్తెతో కొట్టినట్లుగా ఉంటుంది. నిద్రపోతున్నా, నడుస్తున్నా నవ్వుతున్నా, పనిచేస్తున్నా ఎప్పుడూ వాళ్ళ పేగులు ఆకలితో మాడవలసిందే. జీతాలు యిచ్చిన రోజు మాత్రం ఆకలి కాస్త ఉపశమిస్తుంది.

ఆకలిబాధ పోవాలంటే త్రాగవలసిందే. త్రాగిన తరువాత కొన్ని గంటలైనా నరాలమీద, మనస్సు మీద పడే ఆకలి సుత్తి దెబ్బలనుంచి తప్పించుకోవచ్చు. జీతాల రోజున కల్లు త్రాగుతారు. మహా అయితే మరింకా రెండు రోజులు – తరువాత ఇక లాభం లేదు. అద్దెయివ్వాలి, చిల్లర బాకీలు తీర్చాలి. యింట్లో పైఖర్చు కూరగాయలు, బియ్యం, కట్టెలు... తనకి చొక్కాలేదు తొడుక్కుందుకు; కట్టు కుందుకు బీనాబాయికి క్రొత్తచీర కావాలి. పాపం, ఆమె చీర పూర్తిగా చిరిగిపోయింది. మిల్లుచీర ఏమీ మంచిదేకాదు! అయిదు రూపాయాల పావలాకు చీరకొంటే ఆరునెలలన్నా మన్నదు. ఆరో నెల వచ్చేటప్పటికి కుట్టుకోవడం, అతుకులు వేసుకోవటం తప్పదు. ఏడో నెలైనా గడువదు. మళ్లీ అయిదుం పావలాపెట్టి ముదురు రంగు నీలచీర కొనవలసిందే ముదురు నీలం రంగు అయితే బాగా మాపుకు ఆగుతుంది. బీనాబాయి అంట్లు తోముతుంది; బొగ్గులు, నీళ్ళు మోస్తుంది. కాస్త ఆర్జిస్తుంది. బాగా ముదురు నీలం ఆమెకు యిష్టమైన రంగు. ఖరీదుగల అందమైన రకరకాల చీరలు... వాటిని గురించి కలలో కూడా ఆలోచించేందుకు వీలులేదు. ఆరుగురు పిల్లల తల్లి; భర్తకేమో మిల్లులో పని; ఒకసారి మాత్రం బీనాబాయి రకరకాల రంగు చీరల్ని గురించి కలలుగంది. వాళ్ళ వూళ్లో ఉన్నప్పుడు ముచ్చట గొలిపే ఇంద్ర ధనస్సు రంగుల్ని చూచింది. వూళ్ళో సంతలో రకరకాల రంగులు, తండ్రి పొలంలో పచ్చటి వరి; ఈ రంగులన్నీ వదిలివేసి ఆమెకు ఎందుకు ముదురు నీలం రంగుమీద దృష్టి నిలిచిందో! అంట్లు తోముతున్నప్పుడో, ఉతికిన బట్టలు ఆరేస్తున్నప్పుడో ఆమె దృష్టి చక్కటి రంగుల మీదికి పోతుండేది. ఆరేసిన ఆమె చీర అంచుల వెంట కన్నీటిధారగా నీరు కారేది. కాని ఆమె జీవితాన్ని గురించి ఎవరికి కావాలి? నల్లగా, అసహ్యంగా ఉండే అమ్మాయి బట్టలారెయ్యటం రైల్లో ప్రయాణీకులు చూస్తుంటారు. మరుక్షణంలోనే రైలు వంతెన క్రింద నుండి 'లోవర్ పెరెల్' వైపు వెళ్ళిపోతుంది.

* * *

బీనాబాయి చీర ప్రక్కన ఉన్నది జీవనబాయి చీర. అదీ నీలం చీరె, నాసిరకం. దాని బ్రతుకు అటువంటిదేనని చూడగానే తెలుస్తోంది. బీనాబాయి చీరలా కాక యిది మరీ చిరిగిపోయింది. రెండు పెద్ద చిరుగుల్ని జాగ్రత్తగా కుట్టింది. మధ్యలో పెద్ద అతుకు కనుపించుతోనే ఉంది. పాతచీరెలో ముక్క తీసి దీనికి అతుకేసింది, ఎక్కువకాలం మన్నేందుకు. జీవనబాయి భర్త చనిపోయాడు. గడచిన మధురాను భావాల్ని జ్ఞప్తికి తెచ్చుకొని ఆమె ప్రస్తుత దుస్థితిని మఱచిపోతూ ఉంటుంది. బ్రతికి

ఉండగా భర్త త్రాగి తన్నేవాడు. కన్నుకూడా పోయింది. అయినా విధవరాలుకి తన భర్తను జ్ఞప్తికి తెచ్చుకోవటం సహజం.... ఆ రోజున ఆమె భర్త తెగత్రాగాడు. మరి ఆరోజే అతన్ని మిల్లులోంచి తీసేశారు. పాపం ముసలాడు. చాలా అనుభవం ఉన్నప్పటికీ అతను పని త్వరగా చేయలేక పోయేవాడు. కుర్రాళ్ళతో యిక పోటీ చేయలేక పోయేవాడు. ముసలితనంతోపాటు పాడు దగ్గొకటి. దూది నలుసులు ఊపిరితిత్తుల్లో చేరి వర్షాలు వచ్చేప్పుడల్లా ఉబ్బసం వచ్చేది. ఎప్పుడూ రొప్పుడూ దగ్గుతూ వుండేవాడు. ముసలాడి దగ్గువిని మేనేజరు అతనిని పనిలో నుంచి తీసివేశాడు. బోనస్‌గాని పెన్షన్ గాని ఈయకుండా కనికరం లేకుండా తీసేసాడు. పనిపోయిన ఆరునెలలకే ముసలివాడు చనిపోయాడు. భర్త శవం మీద పడి భార్య రోదించింది.

జీవనబాయి భర్తను తలచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. తనను కొట్టినా, తాగివచ్చి జుత్తుపీకినా, ఎందువల్లనో కాని, ఆమెకు తన భర్త తన పట్ల అపచారమేమీ చేయనట్టే తోస్తున్నది. ముప్పైయేళ్ళ కాపురం, ముచ్చటగా లేకపోయినా భర్త ఎన్నడూ దుర్మార్గంగా ప్రవర్తించనేలేదు. మేనేజరు పనిలోంచి తొలగించివేశాడు. ముసలి వాడికి మతిపోయినట్లయింది. కష్టాల వల్ల జీవితం బరువయింది. ఇతరులపై వున్న క్రోధం, తనపై తీర్చుకుంటూండేవాడు. ముసలాడు భరించలేకపోయాడు. మేనేజరు పనినుంచి తీసివేసి, ఒక్క కానీ అయినా యివ్వలేదు. బోనస్ లేదు. పెన్షనూ లేదు. ముప్పై అయిదు సంవత్సరాల క్రితం ఉత్తచేతుల్తోనే మిల్లులో ప్రవేశించాడు. వట్టి చేతుల్తోనే గేటులోంచి బయటికి గెంటివేశారు. ఎవరో తన జీవిత మాధుర్యాన్ని, రక్తాన్ని యీ ముప్పై అయిదేళ్ళలోను పీల్చేసి జీవచ్ఛవములాంటి తనను బయటకు విసరివేశారని అనిపించింది. ముసలాడు అమితాశ్చర్యంతో మిల్లుగేటు వంక, గొట్టం వంక చూశాడు. తాను పూర్తిగా నిస్సహాయుడు; నిర్భాగ్యుడు! 'కళ్లు నలుపుకుంటూ, దుఃఖాన్ని మర్చేందుకు కల్లు దుకాణం వైపుకు మళ్ళాడు.

జీవన దగ్గర ఏమాత్రం డబ్బు ఉన్నా ఆమె కన్ను బాగుపడేదే. ధర్మాసుపత్రి చుట్టూ తిరిగినా ఎవరూ చూసేదిక్కు లేకపోయింది. ఆఖరుకు కన్ను పోయింది. ముసలాడు మంచాన పడ్డాడు. అదే ఆఖరి జబ్బు యిక లేవనే లేదు. జీవన బాయిని ధనవంతుల యింట్లో పాచిపనికి కుదిర్చింది బీనాబాయి. జీవన కష్టపడి పనులు చేస్తూ ఉండేది. అత్తరులో మునిగి వున్న ధనవంతుల కోడళ్ళు ఆమెను తిడుతూ

ఉండేవారు; ఆమెసరిగా పనిచేయడం లేదని! జీవన వాటిని అసలు వినేదే కాదు. తన పనేమో, తానేమో.

ఆఖరకు ముసలాడు చనిపోయాడు. జీవన యిప్పుడు ఒంటరిది; నా అన్న వాళ్లేలేరు. ఎవ్వరినీ పోషించవలసిన బాధ్యత లేదు. ఎప్పుడో పడుచుతనంలో జీవనబాయికి కూతురు పుట్టింది. పెద్దయ్యాక ఓ పోకిరీ వాడితో లేచిపోయింది. చాలాకాలం వరకు కూతురు విషయం జీవనకు తెలియలేదు. ఫరాసు రోడ్డులో కులట ఇంట్లో సిల్కు బట్టలు కట్టుకొని ఉండగా చూశామని అన్నారు. జీవన యీ మాటలు నమ్మలేదు. అందరు కార్మిక స్త్రీల వలెనే అయిదుంపావలా చీరనే ఆమె, జీవితమంతా కట్టుకుంటున్నది. తన కూతురు సిల్కు బట్టలు కట్టుకుందంటే ఆమెకు నమ్మకం లేదు. తన కూతురు అట్లా యెందుకు ప్రవర్తించుతుంది! ఎప్పుడూ అట్లా చెయ్యదు. ఈ వీధిలో అయిదుంపావలా చీరలు కట్టుకొని ఎండురొట్టె తిని నీళ్ళు త్రాగి అంతా జీవిస్తున్నారు. తన కూతురు ఎలా సిల్కుబట్టల మోజులో పడుతుంది! తప్పకుండా తన కూతురు కుర్రవాడి వలలో పడుతుంది గాని సిల్కు బట్టల కోసం కాదు. పిచ్చిపిల్ల! వయస్సులో వుండగా తనూ తన భర్త వలలో ఎలా పడిందీ గుర్తుకు వచ్చింది. ఈ ముసలాడితో 30 ఏళ్ళక్రితం తల్లి దండ్రులను వదిలేసి తనూ లేచివచ్చింది. తన కూతురు అట్లాగే చేసి వుంటుంది. అంతే!

ముసలాడి శవాన్ని తీసుకుపోయే ముందు మెరుస్తున్న సిల్కు బట్టలు కట్టుకున్న ఒక యువతి ఆమె కాళ్ళపైబడి పసిపిల్లలా ఏడ్చింది. మానమర్యాదలు ఆ క్షణంలో అంతమైపోయాయని జీవనబాయి తలచింది. భర్త... కూతురు.... గడచిన కాలం... గడుస్తూన్న కాలం... గడిచేకాలం! రొట్టె తినకుండా మట్టి తిని జీవిస్తున్నానని గౌరవ మర్యాదలనే వాటిని చవిచూడలేదని తలచింది. అటువంటివి ఏవైనా ఉండివుంటే కూతురు పుట్టిననాడే నశించి ఉంటాయి. ఇపుడు తను యేకాకి. గౌరవ మర్యాదలు లేవు. గౌరవ మర్యాదలను మంటగల్పిన కూతురు. రాక్షసి మిల్లు తన యినుప చక్రాలతో చెఱకులోని రసాన్ని పీల్చి పిప్పిని విసిరేసినట్టుగా వాళ్ళను కొంపా, గోడీ, పనిపాటూ లేకుండా విసిరిపారేసింది. తన కాళ్లపైపడ్డ కూతురును పక్కకు నెట్టివేసి, దుఃఖం పట్టలేక కూలబడిపోయింది!

* * *

మూడో చీర రంగేమిటో గట్టిగా నిర్ణయించి చెప్పలేను. పచ్చరంగో, గోధుమరంగో యింకే రంగో నిర్ణయించలేము. ఆ చీర నా భార్య సావిత్రిది. నేను ఫోర్టులో వున్న ఖానూబాయి కంపెనీలో గుమాస్తాను. 65 రూపాయల జీతం, మిల్లులో పనిచేసేవాళ్ళ జీతంతో సమానం అవటం చేత నేనూ వాళ్ళుండే కాలనీలోనే వుండవలసి వచ్చింది. కాని నేను కూలీని కాదు. గుమాస్తాను! స్కూలు ఫైనలు వరకూ చదువుకున్నాను. టైపు వచ్చును, ఇంగ్లీషు బాగానే వచ్చును. మన ప్రధాని నెహ్రూ యింగ్లీషు వుపన్యాసం అర్థం చేసుకోగలను! యింకొంచెంసేపట్లో నెహ్రూగారొచ్చే రైలు వచ్చేస్తుంది. ఆయన గుర్రప్పందాలకు రావటం లేదు' 'చౌపతి'లో వుపన్యసించేందుకు వస్తున్నారు. సభకు లక్షమందైనా వస్తారు. నేనొకణ్ణి. నాకాయన వుపన్యాసాలంటే యిష్టం. నా భార్యకు కూడా ఆయన వుపన్యాసాలు చాలా యిష్టం. ఈరోజు నా భార్య కూడా నాతో రావాలనుకుంటుంది. కాని ఎనిమిదిమంది పిల్లలతల్లి! యిల్లు వదలి ఎట్లా రాగలుగుతుంది! ఎనిమిది మంది పిల్లలతో ఒకే గదిలో అద్దెకుంటున్నాము. వంటచేయటానికి గానీ, పడుకోడానికి గానీ చోటేలేదు. యేదీ చాలదు, వారపు రేషను, నెలజీతం, ప్రతిరోజూ అన్నిటికీ యాతన. నెలజీతం పదిహేను రోజులకు సరిపోతుంది. మిగిలిన పదిహేను రోజులూ కాబూలీ వాడిదగ్గరో, కోమటివానిదగ్గరో అప్పు తెచ్చుకుని జీవించవలసిందే...! మా పిల్లల్ని బడికి పంపించటం లేదు. పుస్తకాలు, జీతం అదినాకు అతీతం! సావిత్రిని పెళ్ళిచేసుకొని యింటికి వచ్చినపుడు ఎన్నో తియ్యటి కలలు కన్నాను. మేమిద్దరం కలలు కనేవాళ్ళం. పిల్లలు చదువుకోవాలని! సావిత్రి చక్కటి కలలు కనేది. మధుర స్వప్నాలు! చల్లగా తాజాగా వున్న చక్కటి కేబేజ్ ఆకుల్లాంటి వూహలు! సావిత్రి ఇప్పుడా విషయాలు మాట్లాడదు! ముడతలుపడ్డ శరీరంతో, ఎప్పుడూ పిల్లల్ని కొడుతూ, నన్ను మాట్లాడనివ్వకుండా రుసరుసలాడే సావిత్రిని మీరు యిప్పుడు చూస్తారు. మా స్థితి యిట్లా ఎందువల్ల అయిందో నాకే తెలియదు. యింట్లో భార్య రుసరుసలు. ఆఫీసులో మేనేజరు తిట్లు! నా భార్యకు కొత్తచీర కొనాలని ఒక్కొక్కసారి అనుకుంటూంటాను. కొత్త యిల్లు కొత్త జీవితం మాకు కావాలనిపిస్తుంది. ఈ తరపు స్త్రీ పురుషులు, ఆఖరికి మన సంతతి కూడా జీవితాంతం కష్టపడటం తప్ప యింకేమీ జీవితంలో మిగలకుండా వుండడానికి కారణమేమిటో మన ప్రధాని నెహ్రూ మనకు ఎందుకు చెప్పరు? పండిట్‌జీ వుపన్యాసం శ్రద్ధగా చదువుతూ వెంటనే కోపం వచ్చి గ్లాసు విసిరేసింది సావిత్రి.

మంచి అందమైన చీర అంత ధర పెట్టలేక కొనలేకపోయినందుకు మా ఇద్దరికీ దెబ్బలాట; అందుకే జీర; మా అబ్బాయి బొమ్మలు కొనమని ఏడ్చి ఏడ్చి చనిపోతాడేమోనని పించి – అప్పటికీ ఎక్కువ ధర అవటంచేత – కొనలేకపోయినందు వల్ల ఆ జీర. వాళ్ళ అమ్మ చనిపోతోంది. వెంటనే రమ్మనమని వచ్చిన టెలిగ్రాం చూసి కూడా రైలు ఛార్జీలు లేక వెళ్ళలేకపోయింది. ప్రియమైన కూతుర్ని చూడకుండానే తల్లి చనిపోయింది. యిదిగో ఈ చీర చిరిగి ముక్కలై తరువాత కొనే కొత్త చీరమీద కూడా ఈ జీరలన్నీ యేదో అద్భుతశక్తివల్ల మెరుస్తూనే వుంటాయి. యెందువల్ల అట్లా జరుగుతూందో వివరంగా చెప్పలేను.

* * *

ఈ నాలుగో చీర కూడా వెలిసి పోయింది బూడిదరంగు చీర! యీ చీరల రంగులు తేడా వున్నప్పటికీ, వెలసి అన్నీ బూడిదరంగుగానే వున్నాయి. ఈ బూడిదరంగు ప్రపంచంలో అన్నిటినీ సవాలు చేస్తున్నట్లుగా వుంది. యవ్వనంలో వున్న శాంత, మధ్యవయస్సులో వున్న సావిత్రి, ముసలి వయస్సులో వున్న జీవన, వీళ్ళ జీవిత విలువలు గణితశాస్త్ర సూత్రాల ప్రకారం అతి తక్కువ. ఈ చీర జాబూ భార్య లతారియాది. లతారియా గొడ్డుమోతురాలని నా భార్య ఆమెతో మాట్లాడదు. లతారియా మంత్రగత్తె అవటం చేతనే ఆమెకు పిల్లలు పుట్టలేదనిపిస్తుంది. మంత్రాలవల్ల పిల్లల్ని చంపగల శక్తి లతారియాకు వున్నట్లు తను నమ్ముతున్నానని నా భార్య నాతో అంది. మా ఆఖరి పిల్ల, మొన్నీ మధ్య చనిపోయిన మా వీధిలో పిల్లలూ వీరంతా లతారియా మంత్రాలవల్లే చనిపోతున్నారని నా భార్య నమ్మకం. ఈ అపనమ్మకం వల్ల ఎవ్వరూ కూడా ఆమెను మార్చలేరు. నిజానికి జాబూ ఆమెను కొన్నాడు. జాబూ స్వగ్రామం మురదాబాదు. చిన్నప్పుడే ఆ వూరు వదలేసి బొంబాయి వచ్చాడు. మాతృభాషయైన హిందీతో పాటు గుజరాతీ మరాఠీ కూడా జాబూ మాట్లాడుతాడు. కొంతకాలం బికారిగా బొంబాయి వీధుల్లో తిరుగుతూ గడిపాడు. ఆఖరుకు మిల్లులో నేత సంచుల శాఖలో పని దొరికింది. జాబూకి చిన్నప్పటి నుంచి యింకో కోరిక వుండేది. వివాహం చేసుకోవాలని. కల్లు, బీడీ వంటి చెడు అలవాట్లు యేమీ లేవు. 80 రూపాయిలు కూడబెట్టాక మురదాబాదు వెళ్ళి వాళ్ళ కులం పిల్లను, చేసుకువద్దామనుకున్నాడు. ఎనభై రూపాయిలు సంపాదించాడు. ఆ డబ్బుతో మురదాబాదు వెళ్ళి పెళ్ళి చేసుకురావటం అసాధ్యమైన విషయం. ఈ డబ్బుతో వాళ్ళ కులం పిల్లను పెళ్ళి చేసుకోలేడు. ఆఖరికి ఒక ఆలోచన తట్టింది.

పిల్లలను అమ్మేవాడి దగ్గర లతారియాను వంద రూపాయలకు కొన్నాడు. ఎనభై రొక్కం, యిరవై అప్పు.... వచ్చే 10 నెలల్లో తీర్చే పద్ధతి.

జాబూ యిప్పుడు సుఖంగా వున్నాడు. లతారియా వాళ్ళ వూరి పిల్లేనని తన కులానిదేనని తెలుసుకున్నాడు. లతారియా చక్కగా పాడుతుంది. జాబూ మిల్లులోకి వెళ్లాక లతారియా వీధిలో పాడుతూ వుండేది. జాబూ వచ్చాక అర్ధరాత్రి వరకూ యిద్దరూ పాడుతూ వుండేవారు. వాళ్ళకు సంతానం లేదు. జాబూ ఓ రోజున మాటలాడే చిలకను తెచ్చి యిచ్చాడు లతారియాకు. అదో ఇంగ్లీషు నావికుడిది. వాడు దానికి చాలా అసహ్యమైన తిట్లు నేర్పాడు. లతారియా జాబూ కలిసి పాడుతూవుండేవారు. చిలక తిట్టుతూ వుండేది. వాళ్లిద్దరూపాడుతూ వుంటే లౌడు స్పీకరు వీధిలో పెట్టినట్టుగా వుండేది.

జాబూ బీడీ, కల్లు తాగేవాడుకాదు. లతారియా చుట్టలు కాల్చేది కల్లు కూడా తాగేది. తాగిన తిక్కమీద యిష్టమొచ్చినట్టు తిడితే పట్టుకొని భర్త తెగతన్నేవాడు. ఆ యుద్ధ సమయంలో చిలక మాత్రం లతారియా వైపు వుండేది. "మిలట్రీ... కొడకా, దాన్ని కొట్టకురా" అంటూ జాబూను తిట్టుతూ వుండేది చిలుక. ఆఖరికి ఓ రోజున "మిలట్రీ... కొడుక్కి" చిలక మీద కోపం వచ్చి తూములో కుక్కేద్దామనుకున్నాడు. లతారియా ఆపింది. జాబూకి దైవభక్తి; పాపభీతి! చిలకను చంపితే పాపం పోగొట్టుకునేందుకు కనీసం యిరవై రూపాయలైన ఖర్చుపెట్టాలి. ఆ భయంతో చిలకను తూములో కుక్కాలనే వుద్దేశాన్ని వదలేశాడు.

మొదట్లో లతారియా గురించి జాబూ అనుమానపడుతూండేవాడు. ఆ వీధిలోని ముసలాళ్ళకు అతను వివాహం చేసుకున్న విధానం నచ్చలేదు. అతను కూడా అనుమానంగానే వుండేవాడు. చిన్న కారణానికి కూడా పట్టుకు బాదేవాడు. కాని నెమ్మదిగా లతారియా అతణ్ణి తనవాడిగా చేసుకుంది. పశువులా అమ్మబడేందుకు యే స్త్రీ కూడా యిష్టపడదని అతనితో చెప్పేది. యిల్లు కావాలనుకునేది; ఆఖరికి యింత చిన్న యిల్లు అయినా సరే ఎంత దుర్మార్గుడైనా, భర్త కావాలనుకునేది. చంటిబిడ్డ ఆఖరికి బక్కగా అసహ్యంగా వున్న సావిత్రి బిడ్డలాంటిదయినాసరే, కావాలనుకునేది. లతారియాకు భర్త, యిల్లు ఉన్నాయి. ఎప్పుడో ఒకప్పుడు భగవంతుడు ఆమెకు సంతానాన్ని యివ్వకపోడు. యివ్వకపోయినా బాధలేదు..... ఆ చిలకనే బిడ్డలా చూసుకుంటోంది.

చిలకకు మేతపెట్టుతూ పాడుతూంటే గుమ్మంలో ఏదో గందరగోళం వినిపించింది. చూసేటప్పటికి దెబ్బతిన్న జాబూని కార్మికులు భూజాలమీద మోసుకొస్తున్నారు. లతారియా పరెగెత్తి తను కూడా సాయం పట్టి గడిలోకి తీసుకొచ్చింది. మిల్లు మేనేజరుతో పోట్లాడాడని తెలుసుకుంది. మేనేజరు యితని పనిలో తప్పుపట్టుకున్నాడు దానికని తిట్టాడు. జూబూ వూరుకొన్నాడు. మేనేజరు తిడుతూ దవడమీద కొట్టాడు. ముక్కోపై జూబూ వెంటనే మేనేజరును మెత్తగా తన్నాడు. మేనేజరు రౌడీలు, జాబూను తల పగిలేట్టు తన్నారు. కాని అతను చచ్చిపోలేదు. చచ్చిపోయాడేమోనని లతారియ చూచింది. కూరగాయలు అమ్మే పని సంపాదించి భర్త మందు ఖర్చుకు డబ్బు సంపాదించేది.

జాబూ యిప్పుడు బాగుపడ్డాడు ఎక్కడా, యే మిల్లు దగ్గరా కూడా పని దొరకలేదు. మిల్లుదారుల సంఘంలో అతనిపేరు బ్లాక్ లిస్టులో ఉంది. మిల్లు గొట్టాలవైపు చూస్తూ విచారంగా రోజంతా గడిపేవాడు. కాని ఏ మిల్లుకు అతను అవసరం లేదు. కార్మికుడు తన్నులు తినవచ్చు...కాని తన్నే అధికారంలేదు.

యిప్పుడు లతారియా తాగటం మానేసింది. తిట్టటం కూడా మానేసింది. సంపాదించిన ప్రతి దమ్మిడీతో సంసారాన్ని గడిపేందుకు ఖర్చుచేసేది. ఆమె యిప్పుడు మాసిన చీరలనే ధరిస్తోంది. కట్టుకున్నచీర పీలికలుకూడా అయింది.

జాబూ త్వరలో పని సంపాదించలేకపోతే పాత గుడ్లముక్కలు దానికి అతుక్కోవలసి వస్తుంది. చిలక్కి ఆహారాన్ని కూడా మానివేయవలసి వస్తుంది. ఇతర మార్గమేమీ కనబడడంలేదు!

అయిదో చీర ఎర్ర రంగు ఊదా అంచు. వాట్లిలాగాక, బాగా చిరిగిఉంది. ఇతర చీరలకూ దీనికి తేడా వుందని నాకు తెలుసు. దీని నూలు చాలా నాణ్యమైనది. అంచు మెరుస్తూ ఉంది. ధర ఎనిమిది రూపాయల ముప్పావలా, అయిదుం పావలా కాదు. ఈ చీర మంజులది. మంజుల యువతి పాపం భర్త మరణించాడు. ఆరు నెలల క్రితం యీ చీరతోనే ఆమె వివాహంచేసుకుంది. క్రిందటి నెలలో ఆమె భర్త మిల్లు ప్రమాదానికి లోనై ముక్కలైపోయాడు. మంజుల పదహారేళ్ళ యవ్వనవతి చాలా అందమైంది. ఆమె మళ్ళీ వివాహం చేసుకోలేదు.... మిల్లు వాళ్ళు నష్టపరిహారం ఏమీ ఆమెకు ఇవ్వలేదు. తప్పు అతనిదేనని చెప్పారు. వదులుగా ఉన్న పటకాలవల్ల అతడు ముక్కముక్కలైపోయాడు. కొత్తది వేయాలంటే డబ్బుఅవుతుంది. కొత్త

పనివాళ్ళనైతే ఎప్పుడుపడితే అప్పుడు పెట్టుకోవచ్చు. కాని పటకామాత్రం కొత్తదివేయరు. పటకా కొత్తది కావాలనే కార్మికుల కోర్కెను యజమాని పెడచెవిని పెట్టాడు. ఆ పటకామార్చాలంటే ఒక కార్మికుడు చావలసి వచ్చింది. ప్రతి చిన్నమాటకు మానవరక్తం ప్రవహించవలసిందే.

భర్త చనిపోయిన తర్వాత మంజుల నష్టపరిహారాన్ని కోరింది. చిల్లి గవ్వలేదు. భర్త చనిపోయిన తరువాత సాధారణంగా స్త్రీలు తెల్లచీరలనే ధరిస్తారు. డబ్బులేక పోవటం చేతనే తెల్లచీర కొనుక్కోలేకపోయింది. ప్రతిరోజూ పెళ్ళికూతురు కట్టుకునే చీరతో మెరిసే అంచుతో కట్టకూడదన్నప్పటికీ దాన్నే కట్టవలసివచ్చింది!

ప్రతీరోజు ఆ చీర భర్తను గుర్తుకు తెస్తుంది. అతని బలమైన చేతులు ప్రేమపూర్వకమైన వేడినిశ్వాసాలు, వైవాహిక పవిత్ర జీవితాన్ని, ప్రతిక్షణం గుర్తుకు తెస్తున్న ఆచీరను ఆమె పారయ్యలేదు. రాత్రింబగళ్ళు శిలువలా దాన్నామె ధరించింది!

* * *

ఆరో చీర; ఆఖరు చీర; బాగా ఎర్రగా ఉంది. దాన్ని కట్టుకునే వ్యక్తి చనిపోయింది. శుభ్రంగా గాలిలో బేనరులాగా ఎగురుతోంది.

అది ముసలి 'మాయి' చీర. ఆ పెద్దగేటుప్రక్క ఖాళీ స్థలంలో ఉండేది. మా కాలనీ వీధులన్నీ తుడిచేది. కొడుకు 'సేతూ' కూడా వీధులు తుడిచేవాడు. సేతు భార్యకూడా వీధులు తుడిచేది. రెండో కొడుకూ వీధులు తుడవడమే. వాళ్ళందరూ యిక్కడి యీ గేటు దగ్గరి ఖాళీ స్థలంలో, అసహ్యంగా, మురికి గుడ్డలతో, చీపుళ్ళతో కాపురం వుండేవాళ్ళు. వాళ్ళకు యీ కాలనీలో ఒక్కగది కూడా లేదు. దూరంగా వుండాలి. అరుబయట కాపురం. తేమగా వున్న కటికి నేలపై నిద్ర. ఈ గేటుకు చాలా దగ్గరలోనే ఆ ముసలి పాకీదాన్ని చంపేశారు. ఆ ఎర్ర చీరకున్న చిల్లులు మీరు చూశారా! వాళ్ళ సమ్మెలో తుపాకీ గుండు అక్కడ తగిలింది. ఆమె సమ్మెలో పాల్గొనే లేదు. సమ్మెలకు పనికిరానంత ముసలిది. కాని ఆమె కొడుకు పాల్గొన్నాడు. నిజానికి అతనే నాయకత్వం వహించాడు. జీతాల పెంపుదల కోసం సమ్మె. పట్టణ పాలకులు యీ సమ్మె న్యాయ సమ్మతం కాదని ప్రకటించారు. సమ్మెదారులు పిరికిపందలు కారు. విప్లవ గీతాలు పాడుతూ, నినాదాలు చేసుకుంటూ ఊరేగింపు లేవదీసారు. వూరేగింపు మా కాలనీ దగ్గరకు వచ్చేప్పటికి వూరేగింపును నిషేధించి

చెదరిపొమ్మని చెప్పారు. వాళ్ళు వెళ్ళిపోలేనందుకు వారిపై కాల్పులు కాల్చారు. యిది మా కాలనీని అనుకొనే జరిగింది. మాఅందరికి భయాలువేసి తలుపులు వేసుకుని కాల్పులు వింటూ కూర్చున్నాము. కాల్పుల నాపుతూ నినాదాలు పెద్దగా వినిపించాయి. యెవరో బాధతో ఏడుస్తున్నారు. యింకొకరు. మరొకరు. యింకెవరో మృత్యుబాధతో గట్టిగా అరచారు. వెంటనే నిశ్శబ్దం! ఏ ధ్వనీ వినిపించలేదు. నెమ్మదిగా తలుపులు తీసిచూచాం. ఊరేగింపు చెదరి పోయింది. గేటుదగ్గర ముసలిది చచ్చిపడి ఉంది. అదే ఆమె చీర. యిప్పుడు ముసలిదాని కోడలు కడుతూ ఉంది. పాపం అత్తగారి చీర!

యీ చీర శవంతో కాల్చేయాలి. చనిపోయినవారి గౌరవార్ధం ఎప్పుడూ అట్లా చేస్తూ ఉంటారు. యీ పాకీవాళ్ళు చాలా విచిత్రమైనవాళ్ళు. చచ్చిపోయినవాళ్ళు ఎట్లాగో చనిపోయారు, యిక బ్రతికినవాళ్ళనే గౌరవించాలంటారు. అందుచేత బ్రతికున్నవాళ్ళు యీచీర కట్టుకుంటున్నారు. సేతుభార్య దీన్ని కట్టుకుంటోంది. తగలబెట్టకుండా ఉపయోగిస్తున్నారు. సేతుభార్య ముసలిదాన్ని తలచుకొని విచారంతో దుఃఖిస్తుంది. నిత్యజీవిత సంఘర్షణలో సంపాదించిన అనుభవం, విజ్ఞానాన్ని జీర్ణించుకున్న యీ ముసలిదాని చీరతో కళ్ళ నీళ్ళు తుడుచుకొని చీపురు తీసుకొని బయలు దేరింది వీధులు ఊడ్చడానికి. ప్రపంచంలో ఏదీ ఆ చీపురును ఆపలేదనట్టు! లాఠీలు, తుపాకీలు జైళ్ళు భూదేవిని శుభ్రం చేసే ఆ చీపురును ఆపలేవు. దానిశక్తి అపారం; నిజం!

అరె! మన ప్రధాని నెహ్రూగారి రైలు వెళ్ళిపోయిందే! ఒక క్షణం సేపైనా యిక్కడ ఆగుతుందనుకున్నాను. నెహ్రూజీ ప్లాట్ ఫారంమీద దిగి మహలక్ష్మి వంతెనకు ఎడమవైపు ఎగురుతున్న ఆ ఆరు చీరలవంక చూస్తారని ఆశించాను. ఈ ఆరుచీరలు మనదేశపు పేద స్త్రీలవే. లక్షలాది స్త్రీల కోసం లక్షలాది యిళ్ళు. లక్షలాది చిన్న యిళ్ళు ఒక పక్క పొయ్యి, యింకో ప్రక్క నీళ్ళకుండ, కిటికీలో చిన్న అద్దం, దువ్వెన, దండెంమీద ఉతికి ఆరవేసిన బట్టలు, చిన్నపెట్టె ఒక మూల నిద్రించే చిన్నబిడ్డ యీ చీరలు అటువంటి లక్షలాది స్త్రీలవి, యీ లక్షలాది స్త్రీల శక్తితోనే–వాళ్ళ సంసారాల సమిష్టి శక్తితో యీ భారతదేశాన్ని నిర్మించారు. వాళ్ళు మన పిల్లల తల్లులు...మన చిట్టి తమ్ముళ్ళ అక్కలు మన పవిత్ర ప్రేమను గానం చేయండి. ఐదువేల సంవత్సరాల మన పూర్వ నాగరికతా శిఖరం!

నెహ్రూజీ! బీద స్త్రీల యీ ఆరు చీరలు మీకేదో చెప్పాలని ఆశిస్తున్నాయి. మీనుండి తెలుసుకొనేందుకు కుతూహల పడుతున్నాయి. మోటారుకారు, పెద్ద ఉద్యోగమో, భవనం కట్టుకొనేందుకు పర్మిషనో, వ్యాపారపు పర్మిట్‌ కోరవు; జీవితంలో చిన్న చిన్న విషయాల్ని గురించి మాత్రమే ప్రశ్నిస్తాయి. ఇట్లా చూడండి. యిది బీనాబాయి చీర, చిన్నతనంలో యింద్ర ధనస్సును కోరుతుంది. జీవనబాయి తన కంటికి వెలుతురు, తన కూతురుకు గౌరవమర్యాద కోరుతోంది. సావిత్రి నశించిన తన జీవిత మాధుర్యం కోసం, పిల్లల కోసం పిల్లల చదువుకోసం కలలు కంటున్నది. లతారియా ఆమె భర్త నిరుద్యోగి. రెండు రోజుల్నుంచి చిలకకు మేతలేదు. యీ చీర 'వెధవ పెళ్ళి కూతురిది' తనభర్త జీవిత విలువకంటే తోలుపటకా ఖరీదు ఎక్కువ యెందుకయిందో చెప్పమంటోంది. యిది ముసలి 'మాయి' ఎర్రచీర. తుపాకీగుళ్ళకు వర్షించిన మానవరక్తం భూతల స్వర్గం నిర్మించుతుందనే దొక్కటే ఆమె చెప్పాలనుకునేది.

కాని నెహ్రూజీ రైలు అక్కడ ఆపకపోవటంచేత, ఆ ఆరుచీరలవంక కూడా చూడలేకపోయారు. పోనీ మీరైనా ఆ మహాలక్ష్మి వంతెన "ఎడమవైపు" ఆరేసిన ఆరు చీరలవంక చూడమని కోరుతున్నాను. వంతెన "కుడివైపు" చాకలి ఆరేసిన–అంతులేని లాభాలు వచ్చే మిల్లు యజమానుల వ్యాపారుల చీరలు–ఆ సిల్కు చీరలను కూడా చూడమని కోరుతున్నాను.

"కుడి" "ఎడమలను" చూసిన తర్వాత ఎవరికివారే వారి మార్గమేదో నిర్ణయించుకొమ్మని నా కోరిక.

మనిషికంటే మతానికే విలువ పెరుగుతున్న ప్రస్తుత సమాజంలో, మతతత్వాన్ని తోసిరాజని మానవత్వానికి పట్టంకట్టే ఏ చిరు ప్రయత్నమయినా ఆహ్వానించదగ్గదేనని నా భావం. అలాగే దేశభక్తి పేరిట దేశాన్ని లూఠీ చేస్తున్న వర్తమాన వ్యవస్థలో ఏది దేశభక్తో ఎవరికది అవసరమోననే స్పృహ కావాలి. అట్టడుగు వర్గాల దీనస్థితికి అద్దంపట్టే కథలు ఇవి. ఉన్మాదం కన్నా వివేచన ఎన్నోరెట్లు ఉత్తమమని యిది చదివిన తర్వాత ఏ కొందరు తీర్మానించుకొని ఆలోచనకి ఆసరాగా నిలబడ్డా ఈ కృషి ఫలించినట్టే.

– **గౌరవ్**, పిఠాపురం.